RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 73 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శనివారం 14-3-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, తిథి ॥ఏకాదశి పూర్తి, ఉ.షా. తె ॥3.02, వర్జ్యం ఉ॥9.48 -11.32, దుర్ముహూర్తం ఉ॥6.18-7.52, శుభ సమయం ఉ॥ 6.00-7.30, రాహుకాలం ఉ॥9.00-10.30, సూర్యోదయం ఉ॥ 6.17, సూర్యాస్తమయం సా॥ 6.04 గం॥

## ఎపి హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణం

2లో



# అమరావతి నిర్మాణాలు మరింత వేగవంతం

- నిర్మాణ పనుల వేగంగా పూర్తికి అనుమతి
- రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు
- చిన్నతరహా పరిశ్రమల ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి
- 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం
- 'సఖి నివాస్' పేరుతో పిల్లల సంరక్షణకు హాస్టళ్ల ఏర్పాటు
- ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం
- గ్యాస సరఫరాలో ఇబ్బందులు రాకుండా మంత్రుల పర్యవేక్షణ
- ఎపి కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

**అమరావతి, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమరావతిలో ప్రతిష్ఠాత్మకమైన సచివాలయం, ప్రభుత్వ విభాగాధిపతుల టవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనాల్లో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఃాజధానిలో తెలుగు సంస్కృతిని చాటిచెప్పేలా రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. అమరావతిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. దీనిలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణం నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకు పలు అంశాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సీఎం చంద్రబాబు నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఏపీ

మిగతా 2లో..

# అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధాని మోడీ
- కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం




**గువాహటి, మార్చి 13 (ఆర్ఎన్ఎ):** అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ.4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరాఝార్ లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అస్సాం అభివృద్ధికి రూ.4,500 కోట్లతో పలు పనులు ప్రారంభించామని, ఇందులో రూ.1,100 కోట్లు బోడోలాండ్ ప్రాంతంలోని రోడ్ల కోసం ఖర్చు చేయనున్నామని చెప్పారు. అస్సాం మేళా ఇనీషియేటివ్ మూడో దశలో అస్సాంలో రోడ్ల అనుసంధానం మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్‌లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ బోడోలాండ్‌ను తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బోడోలాండ్ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు అస్సాంలో కాంగ్రెస్‌కు ప్రజలు ఉద్వాసన చెప్పి బీజేపీ-ఎన్డీయేకు అవకాశం ఇవ్వడంతో చిత్తశుద్ధితో తాము అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్

మిగతా 2లో..

# తొలి ఎఐ క్యాంపస్ కాలేజీగా బిట్స్ పిలాని

మంత్రి లోకేశ్‌తో బిట్స్ ప్రతినిధుల భేటీ... క్యాంపస్ నిర్మాణ ప్లాన్‌లపై చర్చ

వేయికోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడి



**అమరావతి, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న బిట్స్ పిలానీ దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్‌గా ఉండబోతోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఆ సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికతో పాటు వ్యవసాయం నుంచి వాతావరణం, ఆరోగ్య సంరక్షణ వంటి కోర్సులు సైతం ఇక్కడ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి లోకేశ్‌కు వారు వివరించారు. శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసంలో ఆయనతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమయ్యారు. బిట్స్ పిలానీ నిర్మాణ ప్లాన్లను మంత్రి నారా లోకేశ్ పరిశీలించారు. బిట్స్ పిలానీ ప్రతినిధులు లోకేశ్‌ను కలిసి ప్లాన్లు చూపించారు. క్యాంపస్‌లో ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ కోర్సులు ఉంటాయని ప్రతినిధులు వివరించారు. రెండు దశల్లో

మిగతా 2లో..

# దేశంలో గ్యాస్ కొరత లేదు

ప్యానిక్ బుకింగ్స్ అవసరం లేదు: కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, మార్చి 13 (ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ కొరత ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలాంటి భయాందోళనలు వద్దని, 'ప్యానిక్ బుకింగ్' అవసరం లేదని తెలిపింది. సంక్షోభం లేదని వివరించింది. గృహావసరాల కోసం ఎలాంటి అంతరాయం లేకుండా పైపుల ద్వారా సహజ వాయివు , కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు భరోసా ఇచ్చింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఆసుపత్రులు, హాస్టల్స్‌కు ఎల్‌పీజీ సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. మార్చి 2026తో పోల్చుకుంటే దేశంలో ఎల్‌పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, అదనంగా రాష్ట్రాలకు 48,000

మిగతా 2లో..

# నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవం

అల్లూరు జిల్లా గిరిజనలతో నేడు పవన్ భేటీ



**అమరావతి, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 2లో..

# తృణమూల్ నేతలకు అపాయింట్‌మెంట్ ఇవ్వని రాష్ట్రపతి



**న్యూఢిల్లీ, మార్చి 13 (ఆర్ఎన్ఎ):** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరిన తృణమూల్ నేతలకు చుక్కెదురైంది. సమయాభావం వల్ల వారిని రాష్ట్రపతి కలవడం సాధ్యం కాదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమబెంగాల్‌లో ఆదివాసీలకు అందుతున్న సంక్షేమ పథకాలను రాష్ట్రపతికి తెలియజేసేందుకు 12 మంది సభ్యులతో కూడిన టీఎంసీ బృందం అనుమతి కోరగా.. ఈ మేరకు సమాధానం వచ్చింది. అయితే, వచ్చే వారం అయినా తమకు రాష్ట్రపతి సమయం కేటాయించాలని కోరుతూ ఆ బృందం మరో లేఖను రాష్ట్రపతి భవన్‌కు పంపించినట్లు

మిగతా 2లో..

# ఎపి జెన్కో అద్భుత ప్రతిభ

- ఒకే రోజు 6160 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి
- అధికారులను అభినందించిన సిఎం చంద్రబాబు



**అమరావతి, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ విజయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఏపీ జెన్కో ఒకే రోజు 6160 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సాధించి సరికొత్త చరిత్ర సృష్టించిందని వ్యాఖ్యానించారు. ఈ నెల 11వ తేదీన, 6160 మెగావాట్ల ఉత్పత్తితో 93.19 శాతం సామర్థ్యాన్ని సాధించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ రికార్డు ఒక్కరోజే సాధించడం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగానికి సాక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఘనత సాధించడంలో భాగస్వాములైన జెన్‌కో ప్లాంట్ల కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది, ఉన్నతాధికారులకు, శాఖా మంత్రికి, మొత్తం జెన్‌కో టీమ్‌కు సీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు. కూటమి

మిగతా 2లో..

# వంటగ్యాస్ కొరతపై హోటల్స్ యజమానుల ఆందోళన

ఆర్థిక మంత్రి పయ్యావులతో కలసి చర్చలు... ఆంక్షలతో హోటల్స్ నడిపేందుకు సిద్ధమని వెల్లడి

సోమవారం నిర్ణయం తీసుకుంటామన్న మంత్రి



**అమరావతి, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో వంటగ్యాస్ కొరత తీవ్రమవుతున్న నేపథ్యంలో విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అమరావతిలోని సచివాలయంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిశారు. గ్యాస్ కొరత కారణంగా హోటల్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన పలు కీలక చర్యలపై చర్చించారు. విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్యాస్ పొదుపు కోసం తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ పలు ప్రతిపాదనలు మంత్రి ముందు ఉంచారు. గ్యాస్ వినియోగాన్ని తగ్గించేందుకు హోటళ్ల పనివేళలను కుదించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సోమవారం హోటళ్లకు సెలవు దినంగా ప్రకటిస్తే గ్యాస్ పొదుపునకు అవకాశం ఉంటుందని సూచించారు. రెస్టారెంట్లలో లభించే మెనూను కుదించాలని, అలాగే ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ వ్యాపారాన్ని నియంత్రించడం ద్వారా గ్యాస్ వినియోగాన్ని అదుపు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం రెస్టారెంట్లకు కేవలం 75శాతం మాత్రమే గ్యాస్ సరఫరా జరుగుతోందని, హోటళ్లకు ఇచ్చే కోటా గ్యాస్ మరో రెండు రోజుల్లో పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ఫైవ్ స్టార్ హోటల్స్ ప్రెసిడెంట్ స్వామి మాట్లాడుతూ, ఫైవ్ స్టార్ హోటళ్లకు మరో 5 నెలల వరకు సరిపడా గ్యాస్ కనెక్షన్ ఉందని తెలిపారు. అయితే, సాధారణ

మిగతా 2లో..

# ఎపి మాజీ డిజిపి హెచ్‌జె దొర మృతి

అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి... వివిధ హోదాల్లో పోలీస్ శాఖలో కీలక పదవుల నిర్వహణ



**హైదరాబాద్, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్.జె. దొర మరణించారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించు కున్నారు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్లారు. ఇంట్లో బాత్‌రూమ్‌లో ఆయన పడిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు తెలుస్తోంది. 1965 ఐపీఎస్ బ్యాచ్ అధికారి హెచ్.జె.దొర.1996 నుంచి 2002 వరకు ఉమ్మడి ఏపీ డీజీపీగా దొర విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఉమ్మడి ఏపీలో నక్సలైట్లను అణిచి వేయడంలో కీలకంగా వ్యవహరించారు. అలాగే

మిగతా 2లో..

నిజమైన నాగరికత ఇంద్రియ సుఖానుభూతులనుండి, పశుత్వం నుండి మనిషిని ఉద్ధరించేదిగా ఉండాలి. లోపం ఉన్నదని భావించడమే లోపాన్ని సృజిస్తున్నది.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# రాహుల్..అపరిపక్వ విపక్షనేత !

భారత ప్రజాస్వామ్యంలో విపక్ష నేత అంటే బురదజల్లే నేత అని అర్థం రూఢి అవుతోంది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా విపక్షంలో ఉన్నవారు నాలుగు రాళ్లు వేయడం, ఇంత బురద జల్లడం, ప్రభుత్వం ఏం చెబుతుందో తెలుసుకోకుండానే సభనుంచి నిష్క్రమించడం పరిపాటిగా మారింది. సరిగ్గా లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ ఇప్పుడు అదే పాత్రలో ఒదిగి పోయారు. పశ్చిమాసియా యుద్దంతో ప్రపంచమంతా వణుకుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ ఆయుధ బలంతో ఇరాన్‌ను ధ్వంసం చేయడం ద్వారా ప్రపంచంలోని మారుమూల పల్లె కూడా ప్రభావితం అవుతోంది. మనవద్ద గ్యాస్, ఇంధన కొరతలను ఎదుర్కొంటున్నాం. ఇదేమీ మోడీ తెచ్చుకున్న విపత్తు కాదు. లేదా కావాలని కోరుకున్నదీ కాదు. అధికారంలో కాంగ్రెస్ ఉండివుంటే ఇంతకన్నా దారుణంగా ఉండేది. ఎందుకంటే బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాతనే క్రూడాయిల్ దిగుమతి పెరిగింది. ఇంధన సామర్థ్యం పెరిగింది. దేశంలో రిఫనరీల సామర్థ్యం పెంచి వ్యాపారం చేసుకునే స్థాయికి ఎదగింది. గ్యాస్ అందరికీ అందుబాటులోకి వచ్చింది. మారుమూల పల్లెలకు సైతం గ్యాస్ చేరుతోంది. ఇతర దేశాలకు కూడా ఇంధనం సరఫరా చేసే స్థాయికి భారత్ ఎదిగింది. వివిధ దేశాలతో సత్సంబంధాలే ఇందుకు నిదర్శనం. ఇంత సంక్షోభంలోనూ ఇరాన్ మనపట్ల సానుకూలంగా ఉందంటే, మనం అనుసరిస్తున్న విదేశాంగ విధానమే కారణం. రాహుల్ చెప్పటినట్లు నడుచుకుంటే దేశం ఏనాడో భ్రష్టు పట్టిపోయేది. ఇకపోతే ఈ సంక్షోభంలోనూ మనం బంగ్లాదేశ్‌కు ఇంధనం సరఫరా చేయగలి గాం. అయితే ఇవేవీ గమనించకుండా పార్లమెంటులో రాహుల్ చేసిన ప్రసంగం చిన్నపిల్లవాడికన్నా అధ్వాన్నంగా ఉంది. విపక్షనేతకు సమస్యలు, పరిస్థితులు తెలిసి ఉండాలి. కానీ దేశంలో ప్రస్తుతం నెలకొన్న వంట గ్యాస్ కొరతకు, ఎప్‌స్టిన్ ఫైల్స్‌లో పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పేరు ఉండడానికి సంబంధం ఉందంటూ విపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో గురువారం చేసిన ఆరోపణలు ఆయన అజ్ఞానానికి నిదర్శనంగా చూడాలి. రాజకీయ పరిపక్వత లేని నేత విపక్ష నేతగా ఉన్నందుకు సిగ్గుపడాలి. పశ్చిమాసియా లో జరుగుతున్న యుద్ధం కారణంగా వంట గ్యాస్ కొరత ఏర్పడింది. అయినా కేంద్రం దానిని మానిటర్ చేస్తోంది. ఇంధన భద్రతపై ప్రభుత్వం రాజీ పడినందువల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని రాహుల్ చేసిన విమర్శలు దేశం పట్ల ఆయనకున్న అవగాహన ఇదేనని అర్థం చేసుకోవాలి. దేశ ఇంధన అవసరాలపై అమెరికా ఆంక్షలు విధించే స్థితికి తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. మనం ఆయిల్‌ను ఎవరి నుంచి కొనుగోలు చేయాలి, గ్యాస్‌ను ఎక్కడి నుంచి తీసుకురావాలి అన్న నిర్ణయాలను అమెరికాకు విడిచిపెట్టాం అనడంలో అర్థం లేదు. విదేశాల నుంచి వాణిజ్యానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. రష్యా నుంచి ఆయిల్ కొనాలా, వద్దా అన్నది కూడా వాణిజ్య ఒపపందాలకు ముడిపడి ఉన్న అంశం. ఈ మాత్రం తెలియని వ్యక్తి విపక్ష నేతగా ఎలా ఉంటున్నారో ప్రజలు తెలుసుకోవాలి. ఇకపోతే మాట్లాడేదంతా మాట్లాడిన అన్నా చెల్లెళ్లు రాహుల్, ప్రియాంకలు ప్రభుత్వం సమాధానం ఇచ్చే వరకు వేచి చూడకుండా సభ నుంచి నిష్క్రమించారు. ఇది చాలు..వారు ఎంత చిత్తశుద్దిగా ఉన్నారో తెలియడానికి. బయటకు వెళ్లి ధర్నాలు చేయడం తప్ప రాహుల్‌కు తెలిసిందేమీ లేదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇరాన్ మన దేశం పట్ల చాలా సానుకూలంగా ఉండడంతో తొలి చమురు నౌక భారత్ చేరుకోగలిగింది. అలాగే రష్యా నుంచి మనం ఇంధన దిగుమతులకు అమెరికా తలూపింది. ఇవన్నీ కూడా విదేశాంగ నీతిలో ఓ భాగం. ఇకపోతే ఈ యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియదు. అందువల్ల దేశంలో ఉన్న ఇంధన వనరులను జాగ్రత్తగా వాడుకోవాల్సిందే. తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ అక్రమంగా సాగిస్తున్న యుద్దానికి సహకరిస్తున్న స్థావరాలను మూసివేయల్సిందిగా పొరుగున గల గల్ఫ్ అరబ్ దేశాలను ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ కోరారు. లేనిపక్షంలో వాటిపై దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీంనేతగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంపై తీవ్రంగానే స్పందించారు. పూర్తిగా సాధించేవరకు ప్రతీకారానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. కీలకమైన హార్మూజ్ జలసంధిని గురువారం కూడా మూసివేయాలని ఆదేశించారు. ఇంత జరుగుతున్న ట్రంప్ ఇంకా తన వంకర బుద్దిని మార్చుకోవడం లేదు. ముడి చమురు ధరల కన్నా కూడా ఇస్లామిక్ రిపబ్లిక్ 'దుష్ట సామ్రాజ్యాన్ని' నిలువరించడమే తమకు మరింత ముఖ్యమని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన దుర్మార్గాన్ని బయటపెడుతున్నాయి. చమురు ద్వారా లాభాలు ఆర్జించడం కన్నా ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా అడ్డుకోవాలన్నదే ప్రాధాన్యత అని చెప్పారు. ఇరాన్ అణుశక్తిని సమకూర్చుకోవడాన్ని అనుమతించేది లేదంటూ వ్యాఖ్యానించారు. 'పని పూర్తి చేయాలని' అమెరికా కృతనిశ్చయంతో ఉన్నదని ట్రంప్ తెలిపారు. యుద్ధంలో సమర్ధవంతంగా విజయాన్ని సాధించామని, అయినప్పటికీ సైనిక చర్యలు కొనసాగుతాయని ఆయన అన్నారు. అయితే తాను ఎప్పుడు అనుకుంటే అప్పుడే యుద్ధం ముగుస్తుం దంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఇరాన్ తిప్పికొట్టింది. యుద్ధం ముగింపుపై నిర్ణయం తీసుకోవాల్సింది తామేనని స్పష్టం చేసింది. యుద్దాన్ని ముగించేందుకు మూడు షరతులు విధించింది. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలని, నష్టపరిహారం చెల్లించా లని, భవిష్యత్తులో ఎలాంటి దురాక్రమణలు జరగకుండా అంతర్జాతీయ సమాజం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఆ మూడు షరతులు నెరవేరుస్తామని హామీ ఇస్తేనే యుద్దాన్ని ముగిస్తామని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అందువల్ల ఇప్పట్లో అ కుంపటి చల్లారదని తేలిపోయింది. మనవరకు మనం ఇంధన అవసరాలు తీర్చుకోవడం ముఖ్యం. దేశంలో ఇంధన సంక్షోభ పెచ్చరిల్లుతున్న సమయంలో భారత్‌కు పెద్ద ఊరట లభించింది. భారత్ పతాకంతో ఉన్న నౌకలను హర్మూజ్ జలసంధిని దాటేందుకు ఇరాన్ అనుమతించింది. భారత్, ఇరాన్ విదేశాంగ మంత్రులు జైశంకర్, అబ్బాస్ అరాగ్చీ ఫోన్లో మాట్లాడిన అనంతరం మన దేశానికి ఈ ఉపశమనం దక్కింది. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ నౌకలు క్షేమంగా హర్మూజ్ జలసంధిని దాటాయి. ఇంకా ఇలాంటి ప్రయత్నాలు ఉండనున్నాయి. ఇది ఓ రకంగా మనం అనుసరిస్తున్న విదేశాంగ విధాన విజయానికి సూచిక.

# ఎపి హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణం

### ప్రమాణస్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్



**అమరావతి, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ఆవరణలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు పంజాబ్, హరియాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు నుంచి జస్టిస్ లిసా గిల్ ఏపీ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వుల మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఏపీ హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో రెండో స్థానంలో కొనసాగుతారు. హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ సీజేగా నియమితులు కానున్నారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె చరిత్ర పుటలకెక్కనున్నారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్ జనరల్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు సీనియర్ న్యాయవాదులు తదితరులు హాజరయ్యారు. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా.. ప్రస్తుతం 33 మంది ఉన్నారు. జస్టిస్ లిసా గిల్ రాకతో ఈ సంఖ్య 34కు పెరిగింది. ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈ ఏడాది ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత ఆమె సీజేగా నియమితులు కానున్నారు. దీంతో ఏపీ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డ్ సృష్టించనున్నారు.

# రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు

### పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణాకు తరలింపు... అన్నదాత సుఖీభవ కింద రైతు ఖాతాలో ఏటా 20వేలు జమ
### సూరంపల్లిలో అన్నదాత సుఖీభవను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలోని రైతులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఒక్కో రైతుకు రూ. 6 వేలు ఇస్తున్నామన్నారు. రైతు ఖాతాలో ఏటా రూ.20 వేలు జమ చేస్తున్నామని తెలిపారు. కేంద్రం రూ. 6 వేలు ఇస్తే.. మేం రూ.14 వేలు ఇస్తున్నామని చెప్పారు. శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం లోని సూరంపల్లిలో అన్నదాత సుఖీభవ, పీఎం సుఖీభవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని.. రైతుల ఖాతాల్లోకి ఈ పథకానికి సంబంధించిన నిధులు విడుదల చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రైతులు సైతం టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్నా రన్నారు. రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పంటలకు సమయానికి సాగునీరు ఇస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపామని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రధాని మోదీ అసోంలో ఉండి దేశంలోని రైతులందరి ఖాతాల్లో నగదు వేశారని.. ఇది టెక్నాలజీకి ఉండే మహిమ అని వివరించారు. అదే సమయంలో కేంద్రం ఇవ్వాల్సిన నగదు అక్కడ విడుదల చేస్తే.. మనం ఇక్కడ విడుదల చేశామని సీఎం చెప్పారు. అవన్నీ మీ ఖాతాల్లో ఇప్పుడు పరిశీలించుకునే పరిస్థితికి వచ్చిందంటే.. టెక్నాలజీ ఏ విధంగా పని చేస్తుందో మీరందరూ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజు ఎన్నికల ముందు తాను, పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తిరిగి మళ్ళీ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడంతో పాటు రైతుల్ని పూర్తిగా ఆదుకుంటామని మాట ఇచ్చామని చెప్పారు. అందుకే సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఇంకొన్ని సంక్షేమ కార్యక్ర మాలు హామీ ఇచ్చామని పేర్కొన్నారు. ఆ తర్వాత బీజేపీ కూడా కలిసి ఎన్డీఏ కూటమిగా ఏర్పాట య్యామని సీఎం చంద్రబాబు వివరించారు. గడిచిన ప్రభుత్వం ఏ విధంగా దగా చేసిందనే విషయాలు కూడా మనం ఎప్పటికప్పుడు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ?ఈ రోజు మూడో విడతలో 46,85000 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 6 వేలు డిపాజిట్ చేస్తున్నా మని తెలిపారు. అటు కేంద్రం కానీ.. ఇటు రాష్ట్రం కానీ కలిపి మొత్తం రూ. 20 వేల అందిస్తున్నామన్నారు. ఈ విషయం రైతులం దరూ గుర్తు పెట్టుకో వాలని సూచిం చారు. తాను రైతు బిడ్డనని.. మధ్యతరగతి కుటుంబం లో జన్మించి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. రైతు కుటుంబాలు ఇబ్బందుల్లో ఉండ కూడదనే తన ఆలోచన, తపన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యవసాయానికి ప్రత్యేక బ్జడెట్ పెట్టించామని చెప్పారు. కృష్ణాజిల్లాలో నీళ్లు ఆలస్యంగా రావడం వల్ల తుఫాన్‌తో రైతులు నష్టపో యారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు ఇవ్వడం ద్వారా పంటలను కాపాడా మన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల సుడిగుండంలో ఉందన్నారు. ఏపీ ఇమేజ్ దెబ్బ తిందని.. పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా నిలిచిపోయేలా చేశారన్నారు. ఇరవై నెలల్లో ఒక్కో సమస్యను పరిష్కారం చేసుకుంటూ వస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఇన్ని సమస్యలు ఉన్నా.. మీకు న్యాయం చేసిన ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వమని ధైర్యంగా చెబుతున్నా నన్నారు. 47లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు వేశామని పేర్కొన్నారు.ప్రకృతి విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని.. రూ. 300 కోట్లు నష్ట పరిహారం, రూ.500 కోట్ల ధరల స్థిరీకరణకు కేటాయించామని గణాంకాలతో సహా సీఎం చంద్రబాబు వివరించారు.

## మొదటి పేజీ తరువాయి

# అమరావతి నిర్మాణాలు మరింత వేగవంతం



మంత్రివర్గ సమావేశం రాష్ట్ర ప్రగతికి దిశానిర్దేశర చేసింది. చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. దీనికోసం 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నారు. మహిళా ఉద్యోగుల కోసం 'సఖీ నివాస్' పేరుతో పిల్లల సంరక్షణ సౌకర్యాలు కలిగిన హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నారు. పోలీసు శాఖలో 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంఎ÷-లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలను చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నారు. పోలవరం ప్రాజెక్టులో కీలకమైన పనుల కోసం దాదాపు రూ.48 కోట్లను అదనంగా కేటాయించారు. మే 15 నాటికి సాగునీరు విడుదల చేయాలని, ఆ లోపు కాలువలు, డ్రెయిన్ల మరమ్మతుల కోసం 'జలధార' కార్యక్రమాన్ని ఏప్రిల్ 2 నుంచి 90 రోజుల పాటు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అమరావతి అభివృద్ధి, ఉపాధి సృష్టి, జలవనరులు, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, విద్యుత్ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఆర్డీఏ నిర్ణయాలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.తిరుపతి, విజయవాడ, విశాఖ అప్పీల్ కార్యాలయాల పరిధిపై నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్ట గెజిట్‌కు ఆమోదం పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలు చేర్చే ప్రతిపాదనలను కేంద్రానికి పంపే అజెండాకు అమోదం. పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్‌లో అదనపు గ్రానైట్ కొనుగోలు, లైనింగ్ పనులకు రూ.23.47 కోట్లు కేటాయింపు, పోలవరం ప్యాకేజ్-64 పనులకు రూ.24.51 కోట్లు మంజూరుకు అనుమతి లభించింది. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌లో అత్యవసర మరమ్మతు పనులకు నిధుల మంజూరు చేస్తూ ఆమోదించింది. క్యాబినెట్‌లో అజెండా అంశాలు ముగిసిన తర్వాత వివిధ అంశాలపై సీఎం చర్చించారు. గ్యాస్ కొరత రాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు గ్యాస్‌కు బదులుగా ఎలక్ట్రిక్ స్టవ్‌లు వాడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఎలక్ట్రిక్ స్టవ్‌లతో విద్యుత్ డిమాండ్ పెరగడంతో పరిస్థితి పర్యవేక్షించాలని సీఎం సూచించారు. ఏప్రిల్ 2న శాఖల పనితీరుపై నివేదికలు ఇస్తానని, వాటి ఆధారంగా సమీక్ష చేసుకొని పురోగతి సాధించాలని సూచించారు. ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం చేపట్టాలన్నారు. కాలువలు, డ్రెయిన్లు శుభ్రం చేయించి భూగర్భ జలాలను పెంచాలన్నారు. మే 15 నాటికి సాగునీరు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. చివరి ఎకరానికి కూడా నీరిచ్చేలా జలధార కార్యక్రమం జరగాలని సీఎం ఆదేశించారు. కేబినెట్ అజెండా ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు గ్యాస్ సరఫరా, విద్యుత్ వినియోగంపై చర్చించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గ్యాస్ కొరత ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ కొరత వల్ల ప్రజలు ఎలక్ట్రిక్ స్టవ్‌ల వైపు మళ్లుతున్నారని, దీనివల్ల విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 2న ప్రభుత్వ శాఖల పనితీరుపై నివేదికలు విడుదల చేస్తానని.. ఆ ఆధారంగా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని మంత్రులకు దిశానిర్దేశంచేశారు.

# తొలి ఎఐ క్యాంపస్ కాలేజీగా బిట్స్ పిలాని

7 వేల మందికి అవకాశం కల్పించేలా నిర్మాణాలు ఉంటాయన్నారు. క్యాంపస్‌పై ఐదేళ్లలో రూ.1000 కోట్లు పెట్టుబడి పెడతామని ప్రతినిధులు మంత్రికి తెలిపారు. 'నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో క్యాంపస్ నిర్మిస్తున్నాం. గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ విధానాలు పాటిస్తున్నాం. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అమరావతి బిట్స్.. దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్ కానుంది. వ్యవసాయం, వాతావరణం, ఆరోగ్యం సంరక్షణ కోర్సులు ఉంటాయి' అని బిట్స్ ప్రతినిధులు లోకేశ్‌కు వివరించారు. సాధ్యమైనంత త్వరగా క్యాంపస్ ప్రారంభించేలా చూడాలని లోకేశ్ సూచించారు. ఈ సందర్భంగా బిట్స్ చేపట్టిన నిర్మాణ ప్లాన్లను లోకేశ్ పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరగా అమరావతి క్యాంపస్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని వారిని మంత్రి లోకేశ్ కోరారు. బిట్స్ పిలానీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ తదితర కోర్సులు అమరావతి క్యాంపస్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రెండు దశల్లో 7 వేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా అమరావతి బిట్స్ పిలాని నిర్మాణాలను చేపడుతున్నామని చెప్పారు. ఈ క్యాంపస్‌పై వచ్చే ఐదేళ్లలో రూ. 1000 కోట్ల పెట్టుబడి పెడతామని వారు ఈ సందర్భంగా వివరించారు. అలాగే సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో ఈ క్యాంపస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ నిర్మాణంలో గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి పర్యావరణహిత విధానాలను పాటిస్తున్నామని తెలిపారు. బిట్స్ ప్రతినిధులు సిద్దార్థ బెనర్జీ, ఎన్. చెన్నవీర్, బీఎస్ సహాని తదితరులు మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమరావతి క్యాంపస్‌లో నిర్మించే భవనాల డిజైన్లను మంత్రి నారాయణకు వారు వివరించారు. రెండున్నరేళ్లలో మొదటి దశ అడ్మిషన్లకు సిద్ధం చేస్తామని ఈ సందర్భంగా మంత్రికి బిట్స్ ప్రతినిధులు తెలిపారు. మందడం, వెంకటపాలెం మధ్య సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన 70 ఎకరాల్లో బిట్స్ క్యాంపస్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. మూడు దశల్లో ంఎ? క్యాంపస్‌గా బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేపట్టింది.

# దేశంలో గ్యాస్ కొరత లేదు

కిలోలీటర్ల (సుమారు 48 మిలియన్ లీటర్లు) కిరోసిన్ పంపిణీ చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లకు బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మధ్యప్రాచ్యంలో యుద్దానికి ముందు యావరేజ్‌గా 55.7 లక్షల బుకింగ్‌లు ఉంటే మార్చి 12 నాటికి అది 75.7 లక్షలకు పెరిగిందని, భయాల కారణంగానే బుకింగ్‌లు అనూహ్యంగా పెరిగాయని సుజాతా శర్మ తెలిపారు. ఎల్పీజీపై ఒత్తిడి తగ్గేందుకు పీఎన్‌జీ కనెక్షన్లకు మళ్లాలని ప్రజలను కోరారు. క్రూడాయిల్‌కు సంబంధించి 258 మిలియన్ మెట్రిక్ టన్నుల రి÷ఫ్ల÷నింగ్ కెపాసిటీ మనకు ఉందని, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉన్నామని వివరించారు. ప్రధానమైన అర్బన్ సిటీలు, కేంద్రాల్లో కమర్షియల్ వినియోగదారుల ఆందోళన, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కమర్షియల్ వినియోగదారులు స్థానిక సీజీడీ (సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్) నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను కానీ, సంబంధిత డీలర్‌ను కానీ సంప్రదించి పీఎన్‌జీ కనెక్షన్ పొందవచ్చని సూచించారు. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, బంక్‌లు ఖాళీ అయినట్టు 25,000 డిస్ట్రిబ్యూటర్లలో ఏ ఒక్కరి నుంచీ తమకు సమాచారం లేదని సుజాతా శర్మ తెలిపారు. వదంతులను విశ్వసించవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు

వివిధ గ్రూపుల మధ్య అసంతృప్తిని పెంచితే, శాంతి కోసం బీజేపీ పాటుపడిందని, బోడో పీస్ ఒప్పందంపై సంతకం చేసి అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. అస్సాంలో చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, గిరిజనుల భూములను అక్రమంగా చొరబాటుదారులకు కట్టబెట్టిందని మోదీ విమర్శించారు. అయితే గిరిజనుల భూములు వారికే తిరిగి ఇప్పించేందుకు ముఖ్యమంత్రి శర్మ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. దీనికి ముందు, అస్సాంలో రెండ్రోజుల పర్యటన కోసం గౌహతి వచ్చిన మోదీకి రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ, పలువురు రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు సాదర స్వాగతం పలికారు.

# నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవం

పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణులు వేడుకలకు సిద్ధమయ్యారు. అయితే, ఈ ఏడాది పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని గిరిపుత్రుల మధ్య జరుపుకోవాలని పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలోని నందిగరువు గ్రామంలో పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొంటారు. గిరిజనుల కష్టసుఖాలను తెలుసుకుంటూనే, వారి మధ్యే పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించనున్నారు. తొలుత ఓనూరు జంక్షన్ వద్ద జనసేన జెండాను పవన్ కళ్యాణ్ ఆవిష్కరిస్తారు. అనంతరం 'పీఎం జన్ మన్' (ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకం కింద నిర్మించిన రోడ్లను ఆయన స్వయంగా పరిశీలిస్తారు. ఓనూరు జంక్షన్ నుంచి నందిగరువు వరకు నిర్మించిన 2.4 కి.మీ రహదారిని కాలి నడకన ప్రయాణిస్తూ పనుల నాణ్యతను తనిఖీ చేస్తారు. తర్వాత నిర్మాణం పూర్తయిన రహదారులను గిరిజనుల సమక్షంలో ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత నందిగరువు గ్రామ ప్రజలతో పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా భేటీ అవుతారు. వారి సమస్యలను అడిగి తెలుసుకునేందుకు 'మాటా-మంతి' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పర్యటన చివరలో గిరిజనులతో కలిసి పవన్ కళ్యాణ్ మధ్యాహ్న భోజనం చేస్తారు. అధ్యక్షుడి పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో జనసైనికులు సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే పార్టీ ప్రధాన లక్ష్యమని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# తృణమూల్ నేతలకు అపాయింట్‌మెంట్ ఇవ్వని రాష్ట్రపతి

తెలుస్తోంది. ఇటీవల రాష్ట్రతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ ఉల్లంఘన చోటుచేసుకొన్న విషయం తెలిసిందే. నాడు దీనిపై ముర్ము స్వయంగా అసంతృప్తి వ్యక్తంచేశారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని నాడు తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు సీఎం నుంచి గానీ.. మంత్రుల నుంచి గానీ అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. తాను ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సిన ఆదివాసీ సదస్సుకు ఆ రాష్ట్రప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడాన్ని ఆమె ప్రశ్నించారు. 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్‌లోని సిలిగుడికి వెళ్లిన సందర్భంగా ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. ఈ ఘటనపై అధికార, ప్రతిపక్షాల మధ్య పరస్పర విమర్శలు చెలరేగాయి.

# ఎపి మాజీ డిజిపి హెచ్‌జె దొర మృతి

సీఐఎస్ఎఫ్ డీజీగా, విజిలెన్స్ కమిషనర్‌గా సైతం దొర పని చేశారు. 943లో శ్రీకాకుళంలో హెచ్.జె.దొర జన్మించారు. తన సుదీర్ఘ జీవితకాలంలో దాదాపు 40 ఏళ్ల పాటు పోలీస్ విభాగంలో వివిధ హోదాల్లో ఆయన సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మొదట అడిషనల్ డీజీపీగా అనంతరం డీజీపీగా దొర బాధ్యతలు చేపట్టారు. 2002లో డిప్యూటేషన్‌పై దేశ రాజధాని న్యూఢిల్లీలో సీఐఎస్ఎఫ్ డీజీగా పని చేశారు. పోలీసు శాఖతోపాటు క్రీడారంగంలోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఇండియన్ ఒలంపిక్స్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. 1993లో పీపుల్స్ వార్ గ్రూపు లక్ష్యంగా చేసుకున్న 40 మంది పోలీసు అధికారుల జాబితాలో హెచ్.జె.దొర పేరు కూడా ఉంది. రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన పోలీస్ మెడల్ అందుకున్నారు.

# వంటగ్యాస్ కొరతపై హోటల్స్ యజమానుల ఆందోళన

హోటళ్లు మూతపడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హోటల్ యజమానుల సమస్యలను విన్న మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారు. అన్ని హోటళ్లు ఒకేసారి కాకుండా, ప్రాంతాల వారీగా షెడ్యూల్ ప్రకారం తెరిచి ఉంచేలా ఆలోచన చేయాలని మంత్రి సూచించారు. గ్యాస్ కొరతపై చర్చించేందుకు సోమవారం తర్వాత మంత్రుల కమిటీ సమావేశం కానుందని, ఆ రోజు హోటల్ అసోసియేషన్ ప్రతినిధులను కూడా పిలిచి చర్చించి కీలక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. బర్నర్ల వినియోగం తగ్గించడం, ఇతర పొదుపు చర్యలపై ప్రభుత్వం త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయనుందని మంత్రి పేర్కొన్నారు.కాగా, వంటగ్యాస్ కొరత ప్రభావం సామాన్యులతో పాటు హోటల్ పరిశ్రమపై తీవ్రంగా పడుతోంది. ప్రభుత్వం తీసుకునే 'సోమవారం నిర్ణయం' రాష్ట్రంలోని వేలమంది హోటల్ కార్మికులు, వినియోగదారులపై ప్రభావం చూపనుంది.

# ఎపి జెన్కో అద్భుత ప్రతిభ

ప్రభుత్వ 20 నెలల పాలనలో విద్యుత్ రంగం పుంజుకుని వెలుగులు జిమ్ముతోంది అనేందుకు ఈ ఘనత సాక్ష్యమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో జెన్‌కో సాధించే విజయాలు రాష్ట్రానికి మాత్రమే కాకుండా, దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఒకే రోజు 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించటం జెన్‌కోకి చరిత్రాత్మక ఘనత అని వెల్లడించారు. ఈ విజయంతో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగం భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టించేందుకు సిద్ధమైందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

# మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌లు ఆరోగ్యరంగంలో కనిపించని హీరోలు

## -స్విమ్స్ డైరెక్టర్ డా॥ ఆర్.వి.కుమార్ -స్విమ్స్‌లో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ డే

**తిరుపతి,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) హాస్పిటల్ లో మెడికల్ ల్యాబ్ టెక్నిసియన్ డే శుక్రవారం శ్రీ పద్మావతి ఆడిటోరియం ఓ.పి.డి. బ్లాక్ లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా స్విమ్స్ సంచాలకులు/ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్, గౌరవ అతిథిగా విశ్రాంత గ్రేడ్-1 ల్యాబ్ టెక్నిషియన్ టి.రవీంద్రనాథ్ రెడ్డి, ల్యాబ్ డైరెక్టర్ డా. ఎం.ఎం. సుచిత్ర ,డీన్ డా॥ అలోక్ సచన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉషా కళావత్, పాథాలజీ విభాగాధిపతి ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ డా.శివకుమార్, మైక్రోబయాలజీ విభాగాధిపతి ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ డా. జయప్రద, డిప్యూటీ డైరెక్టర్ డా.ఎర్రంరెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ సునీత జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్విమ్స్ సంచాలకులు డా. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నిషియన్లు నిర్వహించే క్లినికల్ పరీక్షలు రోగుల ప్రాణాలను రక్షించే కీలకమైన నిర్ణయాలకు పునాదులుగా పేర్కొన్నారు.ల్యాబ్ టెక్నిషియన్ల కృషి వల్లే వైద్యులు సరైన రోగ నిర్ధారణలు చేసి, సరైన చికిత్స అందించగలుగుతున్నారన్నారు. ల్యాబ్ టెక్నిషియన్లు నిర్వహించే విధులు కేవలం సాంకేతికత తో ముడిపడింది కాదని,అది జీవితాలను కాపాడే సేవ అని కొనియాడారు. "మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌లు ఆరోగ్యరంగంలో కనిపించని హీరోలుగా ఆయన అభివర్ణించారు.'ఈ ప్రయాణంలో ల్యాబ్ టెక్నిషియన్లు చూపుతున్న నిబద్ధత, క్రమశిక్షణ,




మరియు నైపుణ్యం మన సంస్థకు గర్వకారణమన్నారు. ఆధునిక సాంకేతికతను అంది పుచ్చుకుని నాణ్యతా ప్రమాణాలను పాటించాలని,రోగుల భద్రతను ప్రథమ ప్రాధాన్యంగా చూడాలని ఉద్బోధించారు.రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యరంగంలో 'ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. రోగ నిర్ధారణలో, చికిత్సలో, మరియు పరిశోధనలో వారు సాగించే కృషి వైద్య వ్యవస్థకు పునాది వంటిదన్నారు.ల్యాబ్ టెక్నిషియన్లు వైద్యరంగంలో కొత్త ఆవిష్కరణలకు తోడ్పడతారన్నారు.స్విమ్స్ డీన్ డా. అలోక్ సచన్ మాట్లాడుతూ.... మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ లు చేసే ప్రతి పరీక్ష, ప్రతి రిపోర్ట్, ప్రతి విశ్లేషణ రోగుల ఆరోగ్య పరిరక్షణలో కీలకమైనవని, ల్యాబ్ టెక్నిషియన్లు వైద్యరంగానికి వెన్నెముక లాంటివారన్నారు.రోగులకు వైద్యులు సరైన చికిత్స అందించడానికి ల్యాబ్ ఫలితాలు అత్యంత ముఖ్యమని, రోగుల ప్రాణాలను కాపాడే బాధ్యత టెక్నిషియన్ల చేతుల్లో ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్స్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు, టెక్నిషియన్లు, నర్సింగ్ సిబ్బంది, ఫార్మాసిస్టులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా

## ల్యాబ్ టెక్నీషియన్స్ డే సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం, ఉచిత ఆరోగ్య పరీక్షలు

**శ్రీకాళహస్తి రూరల్, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ల్యాబ్ టెక్నీషియన్స్ డే సందర్భంగా పట్టణంలోని ల్యాబ్ టెక్నీషియన్స్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బంగారమ్మ ఆలయం సమీపంలో ఉన్న వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి అక్కడ నివసిస్తున్న వృద్ధులకు భోజనం అందించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమానికి అవసరమైన వాటర్ ప్యూరిఫైయర్‌ను కూడా అందజేశారు. అదేవిధంగా అక్కడ ఉన్న వృద్ధులందరికీ ఉచితంగా రక్తపోటు (బీపీ), రక్తంలో చక్కెర (షుగర్) పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్స్ అందించిన సేవలను వృద్ధులు అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హబీబ్, వేణు, షకీల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## గ్యాస్ గోడౌన్లను తనిఖీ చేసిన తహశీల్దార్ భారతి




**తొట్టంబేడు, మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తొట్టంబేడు మండల పరిధిలోని భారతి గ్యాస్, హెచ్.పీ గ్యాస్, గోడౌన్లను, గ్యాస్ ఏజెన్సీ లను తొట్టంబేడు తాసిల్దార్ భారతి శుక్రవారం తనిఖీ చేశారు. ఏజెన్సీ యజమానులతో మాట్లాడుతూ గోడౌన్లలో గ్యాస్ ఎంత ఉంది. ఎన్ని సిలిండర్ లు ఉన్నాయి. ఎంతమంది వినియోగదారులకు ఇచ్చారు. అని వారి స్టాకు యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొట్టంబేడు మండల పరిధిలో మూడు గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. మండల ప్రజలకు ఎక్కడ గ్యాస్ కొరత లేదు. వినియోగదారులకు గ్యాస్ అందజేయడంలో ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. రూరల్ పరిధిలో ఉన్న గ్యాస్ వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్న 45 రోజుల తర్వాత మళ్లీ గ్యాస్ బుక్ చేయుటకు అర్హత ఉంటుందని ఒకసారి గ్యాస్ తీసుకున్న వారికి 45 రోజుల తర్వాతనే గ్యాస్ వస్తుందని తాసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుజాత, విఆర్ఓ దినేష్, తలారి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సరస్వతీదేవి పూజా కార్యక్రమం

**కోట , మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గ కోట మండల కేంద్రంలోని స్థానిక శ్రీ ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలకు ముందు ప్రతి సంవత్సరం జరిపించే సరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ముందుగా సరస్వతి దేవి అమ్మవారిని విశేష పుష్పాలతో అందంగా అలంకరించారు. అర్చక స్వామి దీవి అనంతచార్యులు, శ్రీ ప్రగతి విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీ పసుపులేటి కిషోర్ పాఠశాల అధ్యాపకులతో కలిసి విద్యార్థిని విద్యార్థుల చేత విశేష పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్య వలన జ్ఞానం పెరగడమే కాకుండా సమాజానికి మేలు జరుగుతుందని కనుక ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని తద్వారా సమాజానికి ఉపయోగపడాలని హితవు పలికారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అయినా ప్యాడ్లు పెన్నులు జామెంట్రీ, సామాగ్రిని బహుమతిగా ఇవ్వడం జరిగింది. వేద పండితులు మరియు అధ్యాపకుల దగ్గర విద్యార్థులు ఆశీర్వాదాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా వెంకటరమణ బాధ్యతలు

**నాగలాపురం, మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాగలాపురం విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.తిరుపతి విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న వెంకటరమణ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. నాగలాపురం విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న రమేష్ డిఈగా పదోన్నతిపై తిరుపతికి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో వెంకటరమణ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా బాధ్యతలు స్వీకరించడం జరిగింది.ఈ నేపథ్యంలో సత్యవేడు విద్యుత్ శాఖ ఏఈ వాసుదేవయ్య ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది నాగలాపురంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ ను కలిసి శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు.

# ఎస్ఎస్‌సి విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం

**తిరుపతి,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరయే విద్యార్థుల కు వారి స్వస్థలాల నుంచి పరీక్షా కేంద్రాలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి రీజనల్ మేనేజర్ జగదీష్ తెలిపారు.ఈనెల 16వ తేది నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగే ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి వీలుగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.అభ్యర్థులు తమ హాల్ టికెట్ లు చూపించి స్వస్థలాల నుంచి పరీక్షా కేంద్రాలకు ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు.పల్లె వెలుగు,అల్ట్రా పల్లె వెలుగు,సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రం ఈ వెసులుబాటు ఉంటుందన్నారు.పరీక్షలు జరిగే రోజులు సెలవు దినాలు అయినప్పటికీ పరీక్షలకు హాజరయే విద్యార్థులకు ఈ సదుపాయం అందుబాటు లో ఉంటుందన్నారు.పరీక్షల రోజుల్లో విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా తగినన్ని ట్రిప్పులు తిప్పాలని అన్ని డిపో మేనేజర్లను ఆదేశించినట్లు ఆర్ఎం తెలిపారు.

## కే.వి.కే. లో 22 వ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ప్రత్యక్ష వీక్షణం

**చింతకొమ్మదిన్నె, మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కృషి విజ్ఞాన కేంద్రం,ఊటుకూరు నందు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 22 వ విడత రైతుల ఖాతాలోకి 2 వేల రూపాయల నగదు జమ ప్రత్యక్ష వీక్షణా కార్యక్రమము శుక్రవారం సాయంత్రం 5.00 గంటల నుండి 06.00 గంటల వరకు ప్రసారం చేయడం జరిగింది.ఈ సందర్భంగా కె.వి.కె సమన్వయకర్త డా. కె.అంకయ్య కుమార్ మాట్లాడుతూ 22 వ విడత పీఎం కిసాన్ కార్యక్రమాన్ని అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించి అన్నదాతల బ్యాంక్ అకౌంట్లలో రూ.2 వేల నగదును జమ చేయడం జరిగింది.అన్నదాతలకు ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకాన్ని ఫిబ్రవరి 2, 2019 వ సంవత్సరం నుంచి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ ఆర్థిక సహాయం రైతులు తమ వ్యవసాయ అవసరాల కోసం,ఇన్పుట్స్ కొనుగోలుకు మరియు నూర్పిడి అవసరాలకు ఉపయోగపడుతుందని అయన తెలిపారు.అలాగే దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన వివిధ ప్రాంతాల రైతులతో ప్రత్యక్ష ప్రసారం ద్వారా సంభాషణ,తదనంతరం సభను, రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడం జరిగింది. దాదాపు 9 కోట్ల 32 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలో 18 వేల 640 కోట్ల రూపాయలు జమ చేయడం జరుగుతుందని,ఇప్పటి వరకు 4.09 లక్షల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో నేరుగా జయ చేయడం జరిగినదని అయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని వివిధ మాధ్యమాల ద్వారా నేరుగా 2.5 కోట్ల మంది రైతులు వీక్షించడానికి వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం కడప మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉస్మాన్ ఘనీ ఆత్మ పదక సంచాలకులు విజయలక్ష్మి మరియు కడప వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీ మాధవి ఏపీ కిసాన్ మోర్చా వైస్ ప్రెసిడెంట్ సతీష్ చంద్ర లు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 14 వేల రూపాయలు రైతుల కోసం అందిస్తున్నట్లు వారు వివరించారు,అలాగే రైతుల ప్రయోజనార్థం ప్రత్యేక గుర్తింపు సంఖ్య వంటి పథకాలను తీసుకొచ్చినట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేవికే శాస్త్రవేత్తలు శిల్పకళ, మహేష్ బాబు,మానస,సాయి మహేశ్వరి,సురేష్ కుమార్ రెడ్డి,కార్యాలయ సిబ్బంది, మరియు భారతీయ జనతా పార్టీ నాయకులు 200 మందికి పైగా రైతులు మరియు వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

## రామాయణాన్ని సరళ భాషలో వ్రాసిన ఘనత కవయిత్రి మొల్లది

### - తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు అందరూ కృషి చేయాలి

### - జిల్లా రెవెన్యూ అధికారి మరియు ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదనరావు

**మదనపల్లె, మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సకల గుణాభిరాముడు శ్రీరాముని చరితను సరళంగా రాసిన ఘనత కవయిత్రి మొల్లమాంబకి దక్కిందని జిల్లా రెవెన్యూ అధికారి మరియు ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదనరావు పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మరియ్యూ జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మొల్ల చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి. మధుసూదనరావు మాట్లాడుతూ... మన కుటుంబం,మన భాష, మన సంస్కృతిపై ముందు మనం ప్రేమ చూపిస్తేనే సమాజం, దేశం పట్ల కూడా ప్రేమ పెరుగుతుందని స్పష్టం చేశారు. తెలుగు భాషను,సంస్కృతిని పరిరక్షించేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇంచార్జ్ తేజస్విని మాట్లాడుతూ. శ్రీ కృష్ణదేవరాయల పాలనా కాలంలో ఆమె రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా శాలివాహన సంఘం ప్రతినిధులు ,వెనుకబడిన తరగతుల శాఖ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు అన్నదాన కార్యక్రమం

**గూడూరు, మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పర్మినెంట్ ప్రోగ్రామ్స్ లో భాగంగా ప్రతినెల క్రమం తప్పకుండా అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఆ క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి తెలియజేశారు. గూడూరు పట్టణంలోని వాటర్ ట్యాంక్ ప్రాంతంలో ఏర్పాటయి అన్న సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు పోచారెడ్డి ధనుంజయ రెడ్డి, సుమన్ కుమార్ రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి, కసిరెడ్డి విజయ రాఘవరెడ్డి ల జ్ఞాపకార్థం దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి దాతృత్వంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్ ఎలసరి గోపాల్ రెడ్డి, ట్రైనీ వాసు గౌడ్, బండి ధనుంజయ రెడ్డి,కోట కృష్ణ, బలరామిరెడ్డి, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధిలో తగ్గేదే లేదు

### తుంబూరులో భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**సత్యవేడు, మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తన సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో తగ్గేదే లేదని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే శ్రీ కోనేటి ఆదిమూలం నారాయణవనం మండలం తుంబూరు చేరుకొని రూ.35 లక్షలతో కొత్తగా నిర్మించనున్న తారురోడ్డు కు భూమి పూజ చేశారు.అనంతరం తుంబూరు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నేత సుబ్రమణ్యం న పరామర్శించి, త్వరగా కోలుకొని మళ్లీ ప్రజా జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.తదుపరి నారాయణవనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని హెచ్ పి వి వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందించే ఈ హెచ్ పివి వ్యాక్సిన్ ద్వారా క్యాన్సర్ రాకుండా నివారించవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవంతం చేయాలని పిలుపు



**పీలేరు, మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** : తిరుపతి యూత్ హాస్టల్ లో ఈనెల 16న జరిగే మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల మాల మహానాడు ప్రతినిథులు పిలుపునిచ్చారు.శుక్రవారం మండల ప్రచార కార్యదర్శి అర్పింటి రెడ్డెప్ప ఆధ్వర్యంలో స్థానిక మాలమహానాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ సమాజంలో కుల వివక్ష, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయని మాలలపై దాడులు భూస్వామ్య దోపిడీలు, అణిచివేతలు తరచూ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నాయని భూసమస్యలు, ఉపాధి సమస్యలు, బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ వంటి అంశాల పైన మరియు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మాలమహానాడు తన లక్ష్యాలను సాధించడానికి కార్యవర్గ సమావేశం ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి మాల మేధావులు, సామాజిక కార్యకర్తలు విచ్చేస్తున్నారని,రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి మాలమహానాడు కార్యకర్తలు నాయకులు పాల్గొని తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాలమహానాడు సీనియర్ నాయకులు పల్లం దామోదర్, మండల కార్యదర్శి తుమ్మల రవికుమార్,మండల కార్యవర్గ సభ్యులువిజయ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా అమర ఆసుపత్రిలో 'స్లీప్ స్టడీ' ప్యాకేజీ ప్రారంభం

**రేణిగుంట, మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా కారకంబాడిలోని అమర ఆసుపత్రిలో ప్రత్యేక లిస్లీప్ స్టడీ ప్యాకేజీ'లిని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరినేని రమాదేవి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిద్రలేమి, గురక, స్లీప్ అప్నియా వంటి సమస్యలు ప్రస్తుతం చాలా మందిలో కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ సమస్యలను తొలిదశలో గుర్తించేందుకు 'స్లీప్ స్టడీ' పరీక్షలు ఉపయోగపడతాయని వివరించారు.మంచి ఆరోగ్యానికి రోజుకు కనీసం 7-8 గంటలు నిద్రపోవడం అవసరం అని సూచించారు. నిద్ర సమస్యలు ఉన్నవారు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు.ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా మార్చి 16, 18, 23, 25, 26 తేదీల్లో నిద్ర మరియు ఈఎన్‌టి సమస్యలకు ఉచిత వైద్య సంప్రదింపులు ఉంటాయని, అలాగే హోమ్ స్లీప్ స్టడీ పరీక్షలపై 20% రాయితీ అందిస్తామని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది.

## అక్రమ బాణాసంచా తయారీ నిందితులు అరెస్ట్

### - ముడి సరుకులు టపాసులు స్వాధీనం : డీఎస్పీ







**తడ , మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తడ మండలం అక్కంపేట గ్రామ పరిధిలో అక్రమంగా బాణాసంచా తయారు చేస్తున్న నిందితులను తడ ఎస్సై కొండప నాయుడు అరెస్టు చేసి వారి వద్ద నుండి బాణాసంచా తయారీకి ఉపయోగించు ముడి సరుకులను, కొన్ని టపాసులను స్వాధీనం చేసుకున్నారు. సూళ్లూరుపేట సర్కిల్ ఆఫీస్ నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డిఎస్పి చెంచు బాబు మాట్లాడుతూ తడ మండలం అక్కంపేట గ్రామ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రియదర్శని కాలేజి వెనుక వైపు తన పొలములో ఎటువంటి అనుమతులు లేకుండా మూడు షెడ్లను నిర్మించి అందులో బాణాసంచి తయారీ చేస్తుండడంతో అరెస్టు చేయడం జరిగిందని, సూళ్లూరుపేట పరిసర ప్రాంతాలలో ఆపరేషన్ వజ్రప్రహార్ పేరుతో ఫిబ్రవరి 21 నుండి మార్చి 20 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని, పాత గంజాయి నిందితులను, వాళ్ల తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని, కాబట్టి ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలను అమ్మినా, కొన్నా, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈయన వెంట సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి కృష్ణ, ఎస్ఐ కొండప్ప నాయుడు పాల్గొన్నారు.

## దొమ్మరపాలెం కొత్త ఇండ్ల వద్ద నత్తనడకల రోడ్డు పనులు

### - ప్రాణాలు చేతబట్టుకుని ప్రయాణం చేస్తున్న ప్రజలు




**శ్రీకాళహస్తి రూరల్ , మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని దొమ్మరపాలెం కొత్త ఇండ్ల ప్రాంతంలో రోడ్డు పనులు ప్రజలకు తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి . కొత్తగా తారు రోడ్డు వేసేందుకు పాత తారు రోడ్డును పూర్తిగా తొలగించి, రోడ్డుకింద వేయాల్సిన మెటల్ రాళ్లను వేసి వదిలేశారు. అయితే పనులు మాత్రం నత్తనడకన సాగుతుండటంతో ఆ మార్గంలో ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు, అదేవిధంగా పాదచారకులు ప్రాణాలు చేతబట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉంది రోడ్డు పొడవునా మెటల్ రాళ్లు ఉండటంతో భారీ లారీలు, బస్సులు వెళ్తున్న సమయంలో ఆ రాళ్లు టైర్ల కింద పడి ఎక్కడ ఎగిరి మనుషులపై పడతాయోనని ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనల్లో కొందరికి తలలు పగిలి తీవ్ర గాయాలు కాగా, మరికొందరు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు చెబుతున్నారు. అంతేకాదు, లారీలు వెళ్లే సమయంలో ఎగిసే భారీ దుమ్ముతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పరిస్థితి ప్రమాదకరంగా మారినా పనులు మాత్రం నత్తనడకన సాగుతుండటం పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులను వేగవంతం చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని వాహనదారులు, స్థానికులు కోరుకుంటున్నారు.

## నాటకానికొక నవ్య దిశను నిర్దేశించిన కోలాచలం

### - ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

**కడప , మార్చి13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చారిత్రక నాటక రచనలతో ఆంధ్ర చారిత్రక నాటక పితామహులు ' గా ప్రసిద్ధులై తెలుగు నాటకానికొక నవ్య దిశను నిర్దేశించిన మహోన్నత నాటక కర్త కోలాచలం శ్రీనివాసరావని వైయ స్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. కోలాచలం వారి173 వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం వైయస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కడప రాజీవ్ కల్చరల్ క్లబ్ లో ఆయన జయంతి జరిపా రు.మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కోలాచలం చారిత్రక నాటకాలకు ఆద్యుడే కాకుండా తెలుగు నేలలో తొలి శాశ్వత ప్రదర్శనశాలను నిర్మించిన ఘనత ఆయనకే దక్కుతుందని,వీరు దాదాపుగా 30 నాటకాలు రచించారని, మదాలస అనే నాటకం తో ప్రారంభించి సీమంతిని, శిరోమణి,రుక్మాంగద, లవకుశ, ప్రహ్లాద, సత్య హరిశ్చంద్ర, శ్రీరామ జననం, సీతా కళ్యాణం,గిరిజా కళ్యాణం వంటి పౌరాణిక నాటకాలే కాకుండా రామరాజు చరిత్ర,సుల్తానా చాంద్ బీ, ప్రతాపాగ్నరీయం తదితర నాటకాలు రాశారని,వారు ఆంగ్లంలో' 'ప్రపంచ నాటక రంగ చరిత్ర 'రచించి విశ్వవిజ్ఞాన వేదిక ముందు తెలుగు వారి ఘన చరితను చాటి చెప్పారన్నారు. 'మధురకవి'డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ కోలాచలం రచించిన రామరాజు చరిత్ర నాటకంలో పఠాన్ పాత్ర ద్వారానే బళ్లారి రాఘవకు గొప్ప కీర్తి ప్రతిష్టలు లభించాయని, మహాత్మా గాంధీ గారితోనే 'జై రాఘవ 'అని జై కొట్టించుకొని భారతదేశం గర్వించదగ్గ నటుడుగా బళ్లారి రాఘవ ఎదగడానికి కారణం కోలాచలం వారేనని,కోలాచలం వారు తమ నాటకాలన్నీ ఆనాటి సమాజానికి అనుగుణంగా సంఘసంస్కరణ దృష్టితో రాశారని అన్నారు. ప్రసిద్ధ రంగస్థల కళాకారులు వీర దాసరి ప్రకాష్, దేవరశెట్టి గంగయ్య,దాసరి సుధాకర్, అయ్యగార్ల పవన్ కుమార్ లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో మండల మురళి, మాలెపాటి సత్యనారాయణ, ఎన్ వీరన్న, మండల చెన్నయ్య, ఎన్ ప్రకాష్ శర్మ,ముంతావెంకటసుబ్బయ్య,బాల ఓబయ్య మొదలైన రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సాయం వెలకట్టలేనిది

### - శ్రీదుర్గ మృతిపై రాజకీయం చేయడం తగదు - జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పీ షణ్ముగం



**చిత్తూరు,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అందించిన సాయం, సహకారం తమ కుటుంబానికి వెలకట్టలేనిదని చిత్తూరు సహకార టౌన్ మాజీ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి షణ్ముగం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఉదయం స్థానిక ఏఎస్ఎం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లోని వల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన తెలుగుదేశం పార్టీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి శ్రీదుర్గ మృతిపై వైఎస్ఆర్సిపి నేతలు రాజకీయం చేయడం తగదన్నారు. వైకాపా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చిత్తూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి విజయానందరెడ్డి ప్రమాదంలో మృతి చెందిన తన కుమార్తె శ్రీదుర్గ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే లేదా, వారి ట్రస్ట్ ద్వారా ఎటువంటి ఆర్థిక సాయం చేయలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గాయపడిన తన కుమార్తె చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి, అపోలో ఆసుపత్రిలో సరైన వైద్యం అందకపోవడంతోనే మృతి చెందినట్లు పోస్టుమార్టం ద్వారా తెలిసిందని తెలిపారు. ఈ విషయంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సహకారంతో అపోలో యాజమాన్యంపై మూడు నెలలు పోరాటం చేసినట్లు చెప్పారు. ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను కోరినప్పటికీ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి విజయానందరెడ్డి స్పందించక పోగా అపోలో యాజమాన్యంతో నాకు బంధుత్వం ఉందని చెప్పారని పేర్కొన్నారు. అలాంటి పెద్దమనిషి నేడు తన కుమార్తె మరణాన్ని ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ట్రస్ట్ నుండి 20 లేదా 30 లక్షల రూపాయలు ఇవ్వలేదని విమర్శించడం సరికాదని, తమ కుటుంబానికి ఎమ్మెల్యే, వారి కుటుంబ సభ్యులు ఎప్పటికప్పుడు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పినా తాము సున్నితంగా తిరస్కరించినట్లు పేర్కొన్నారు. శ్రీదుర్గ కర్మకాండ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సహా పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై సొంత కుటుంబంలా ఆదరించారని చెప్పారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఎమ్మెల్యే కుటుంబం, పార్టీ నాయకులు, జిల్లా కలెక్టర్ తమ కుటుంబానికి అండగా ఉన్నారని తెలిపారు. శబరిమలలో మరణించి పార్థివ దేహాన్ని చిత్తూరుకు తీసుకొచ్చిన వైకాపాకే చెందిన చిత్తూరు సహకార టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ రామ్ గణేష్ కుటుంబ సభ్యులకు ఇన్ని నీతులు చెబుతున్న విజయానందరెడ్డి, ఆయన ట్రస్టు ద్వారా గాని ఎటువంటి సహాయ సహకారాలు అందించారో తెలపాలని ప్రశ్నించారు. తమ కుటుంబానికి సాయం చేయలేదని చెప్పే నైతిక హక్కు వైఎస్ఆర్సిపి నాయకులకు లేదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం శ్రీదుర్గ మృతిని ఉపయోగించడం సరైంది కాదని హెచ్చరించారు. చిత్తూరు నగర అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. ఇకపై అసత్య ఆరోపణలు మాని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకారాన్ని అందించాలని కోరారు. అలాకాని పక్షంలో మౌనంగా ఉండాలని అసత్య ఆరోపణలు చేస్తూ పత్రికల ముందు ప్రకటనలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని షణ్ముగం హెచ్చరించారు.



# చిత్తూరు జిల్లా

## ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మంటలు

### - భయబ్రాంతులకు గురైన రోగులు, వైద్యులు



**చిత్తూరు, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో శుక్రవారం మధ్యాహ్నం మంటలు చెలరేగడంతో రోగులు, వైద్యులు, అధికారులు భయబ్రాంతులకు గురయ్యారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో పాడుబడ్డ ఆరు 108 వాహనాలను నగరానికి చెందిన ఓ తుక్కు కొనుగోలు వ్యాపారి టెండర్ల ద్వారా దక్కించుకొన్నాడు. ఈ నేపథ్యంలో వాటిని గ్యాస్ కట్టర్ల ద్వారా కట్ చేస్తుండగా అకస్మాత్తుగా వాహనానికి మంటలు అలముకొన్నాయి. ఈ క్రమంలో కార్మికులు పనిచేస్తున్న వాహనంతో పాటు, దానికి అతి సమీపంలో ఉన్న మరో అంబులెన్స్ వాహనం సైతం మంటలు అలుముకొని దగ్ధమైంది. రెండు వాహనాల నుంచి ఒకేసారి మంటలు చెల్లరేగడంతో ఆసుపత్రి ఆవరణమంతా దట్టమైన పొగ అలుముకుంది. విషయం తెలుసుకున్న వైద్యశాల సెక్యూరిటీ సిబ్బంది స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేయడంతో అప్పటివరకు భయాందోళనకు గురవుతున్నవారు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

## పీజీ మెడికల్ విద్యార్థులకు మార్గదర్శకం

### ఎఐఎంఎస్ఆర్‌లో ఓరియెంటేషన్ కార్యక్రమం



**చిత్తూరు, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మురకంబట్టులోని అపోలో నాలెడ్జ్ సిటీ పరిధిలో ఉన్న అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఎఐఎంఎస్ఆర్)లో 2025 బ్యాచ్‌కు చెందిన పీజీ విద్యార్థులకు శుక్రవారం ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. పీజీ విద్యలో అవసరమైన అకడమిక్ విధానాలు, క్లినికల్ శిక్షణ, పరిశోధన అవకాశాలు, ఆసుపత్రి విధులు, బాధ్యతలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె. ఆగస్టిన్ మాట్లాడుతూ పీజీ విద్యలో మూడు అంశాలు అత్యంత కీలకమని చెప్పారు. క్లినికల్ ఎక్స్‌పోజర్, సక్రమమైన అకడమిక్ ప్రోగ్రామ్, మెరుగైన పరిశోధన వాతావరణం పీజీ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. అపోలోలో ఈ మూడు అంశాలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ది అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలలో వైద్య విద్యలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఎఐఎంఎస్ఆర్‌లో చేరిన పీజీ విద్యార్థులకు చిత్తూరు ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో విస్తృతమైన క్లినికల్ అనుభవం పొందే అవకాశం ఉందన్నారు. ఈ ఆసుపత్రిలో ప్రతిరోజూ సుమారు రెండు వేల మంది అవుట్ పేషెంట్లు, నాలుగు వందల వరకు అత్యవసర కేసులు, అనేక శస్త్రచికిత్సలు జరుగుతుంటాయని, ప్రాక్టికల్ పరిజ్ఞానం పొందేందుకు ఇది అత్యుత్తమ వేదిక అని చెప్పారు. యూనిట్ హెడ్ ఎస్. బాలరాజ్ ఎఐఎంఎస్ఆర్ మరియు జిల్లా ప్రధాన ఆసుపత్రి కార్యకలాపాలపై సమగ్ర అవలోకనం అందించారు. కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బి.జి. రంగనాథ్ పీజీ కోర్సుల నిర్మాణం, ప్రక్రియలు, నియమ నిబంధనలపై వివరించారు. అసోసియేట్ డీన్ (అకాడమిక్స్) డాక్టర్ రమ్య రామకృష్ణన్ మాట్లాడుతూ పీజీ విద్యార్థులు విద్యా పరంగా పూర్తి చేయాల్సిన అకడమిక్ బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ (రిసర్చ్) డాక్టర్ ఉషా అడిగ, మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్, ప్రొఫెసర్ డాక్టర్ ఎ.కిషోర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. పీజీ విద్యార్థులు తమ వైద్య విద్యను సమర్థంగా వినియోగించుకుని రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని అధ్యాపకులు సూచించారు.

## కవయిత్రి మొల్ల జయంతిని రాష్ట్ర పర్వదినంగా పరిగణించిన ప్రభుత్వం

### - కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



**నగరి, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల (మొల్లమాంబ) జయంతిని, మొదటి సారిగా.., మార్చి 13న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పర్వదినంగా..,అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం తెలుగు జాతికే గర్వకారణమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. తెలుగు సాహిత్యంలో మహిళా రచయిత్రుల కృషికి, ముఖ్యంగా ఆతుకూరి మొల్లమాంబకు ఘనమైన గుర్తింపు లభించిందన్నారు. రామాయణాన్ని తెలుగులో రచించిన మొల్లమాంబకు నివాళిగా, ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన కూటమి ప్రభుత్వానికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మొల్లమాంబ రచించిన 'మొల్ల రామాయణం' ప్రపంచ ప్రసిద్ధి చెందిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు శుక్రవారం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. 2023లో జీవో నంబర్ 99 విడుదల విషయాన్ని గుర్తు చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ..,కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన మొల్ల తొలి తెలుగు శూద్ర కవయిత్రిగా.., ఆది కవయిత్రిగా కూటమి ప్రభుత్వం కొనియాడుతూ, తెలుగు సాహిత్యంలో మహిళా రచయిత్రి మొల్ల కృషికి గుర్తింపునిస్తూ..., ఆమె జయంతిని రాష్ట్ర పర్వదినంగా జరపాలని పరిగణించడం,ఆమెకిచ్చే ఘనమైన నివాళి అని కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని కొనియాడారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.

## మూగ జీవుల దాహార్తిని తీర్చాలి

### - జీవ కారుణ్యవాదుల వినతి



**కుప్పం, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వేసవి కాలం లో మూగజీవుల దాహర్తిని తీర్చాలని జీవకారుణ్య వాదులు స్థానిక ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేసారు గతం లో ప్రభుత్వం పెద్ద ఎత్తున నియోజక వర్గంలో ప్రతి గ్రామంలో పశువుల నీటి తొట్లుని ఏర్పాటు చేయడం జరిగిందని అయితే గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటించక నాసిరకంగా నిర్మించడం తో పగుళ్ళు ఏర్పడి నీరు నిల్వ ఉండకుండా దాదాపుగా అన్ని నీటితొట్లు నిరుపయోగంగా తయారయ్యాయని వారు పేర్కొన్నారు. పాలకులు ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలు నిధులను వెచ్చించి చేపట్టిన బృహత్తర పశువుల నీటి తొట్లు వినియోగానికి నోచుకోక నేడు వెక్కిరించే ధోరణిలో ఉన్నాయని,ప్రస్తుతం వేసవి కాలం కావడంతో మార్చి, ఏప్రిల్, మే మూడు మాసాల పాటు తీవ్రంగా త్రాగునిటీ ఎద్దడిని ఎదుర్కొనే దుస్థితి లో మూగ జీవులు బాధ వర్ణనాతీతం గా ఉంటుందని,ప్రభుత్వ పెద్దల చొరవ ఆదేశాలతో నీటి తొట్లకు మరమ్మత్తులు చేపట్టి మూగ జీవులు దాహార్తిని తీర్చడానికి అందు బాటులో కి తీసుకు రావాలని జీవ కారుణ్య వాదులు పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వరల్డ్ కిడ్నీ డే

### - ఇలా చేస్తే మీ కిడ్నీలు సురక్షితం



**పుంగనూరు , మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుంగనూరు లయన్స్ క్లబ్,అపోలో డయాలసిస్ సంయుక్తంగా బి ఎం ఎస్ క్లబ్ నందు శుక్రవారం వరల్డ్ కిడ్నీ డే లయన్స్ డా.సరళ డా.తేజస్విని ల ఆధ్వర్యంలో స్క్రీనింగ్ క్యాంప్, కిడ్నీ వ్యాధులు పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ చైర్మన్ కె. బాలసుబ్రమణ్యం మాట్లాడుతు.... మన శరీరంలోని మలినాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ శరీరం ఎప్పుడూ పరిశుభ్రంగా ఆరోగ్యంగా ఉండడానికి మూత్రపిండాలు దోహదపడతాయి. ఇవి రోజుకు దాదాపు 200 లీటర్ల రక్తాన్ని శుద్ధి చేస్తాయి. వాటి పనితీరు ఆధారంగా మిగతా శరీర భాగాలు సమతుల్యం చెంది సమర్థవంతంగా పనిచేసి శరీరానికి రక్షణ కల్పిస్తాయని ప్రస్తుత కాలంలో అత్యాధునిక వైద్య పద్ధతులు ఎన్ని వచ్చినా ఆందోళన కలిగించే అసంక్రామ్యత దీర్ఘకాల వ్యాధుల జాబితాలో కిడ్నీ సమస్య ఒకటి ప్రపంచవ్యాప్తంగా వేధిస్తోందన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ డే కార్యక్రమం లయన్స్ జోన్ చైర్మన్ ముత్యాలు, డా. రమ్యశ్రీ, డా సోఫియా,డా. చరణ్ ఎల్ సి ఐ ఎఫ్ లో త్రిమూర్తి రెడ్డి లయన్స్ క్లబ్ మెంబెర్ షిప్ చైర్మన్ అమరావతి సురేష్,లయన్స్ వైస్ ప్రసిడెండ్ సుధాకర్ రావ్, ట్రజరర్ లయన్ కేశవ రెడ్డి, లయన్ మహేందర్ రావ్,లయన్ గోపాల కృష్ణనన్,మీడియా చైర్ పర్సన్ సతీష్ కుమార్ లయన్స్ క్లబ్ డయాలసిస్ ఇంచార్జి భరత్, లాయన్స్ క్లబ్ సభ్యులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన



**పలమనేరు, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడే ఆదేశాల మేరకు పలమనేరు డి.ఎస్.పి దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో పలమనేరు అర్బన్ సీఐ కె. మోహన్ రెడ్డి పలమనేరు మండలంలో ఉన్న ట్రాక్టర్ల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాక్సిడెంట్లు జరగకుండా ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లను అమర్చడం ఆవశ్యతను తెలియజేశారు. ట్రాక్టర్ డ్రైవర్లకు, ఓనర్లకు రోడ్ యాక్సిడెంట్లు జరగకుండా ఎ అవగాహనను కల్పించినట్లు సీఐ చెప్పారు ప్రధానంగా ట్రాక్టర్ డ్రైవర్ కు లైసెన్స్ తప్పకుండా ఉండాలని, రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ట్రాక్టర్ క్రాస్ చేసేటప్పుడు డ్రైవర్ ముందర వెనుక చూసిన తర్వాత నెమ్మదిగా క్రాస్ చేయాలన్నారు. ప్రమాదాలు నివారించడమే పోలీసుల బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

### - 47 మందికి రూ. 48 లక్షలు అందజేత

**పెనుమూరు, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆపదలో ఉన్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని, బాధితులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ మరియు గంగాధరనెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ వి.ఎం. థామస్ అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ అధ్యక్షులు షణ్ముగ రెడ్డితో కలిసి ఆయన గంగాధర నెల్లూరులో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 47 మంది బాధితులకు సుమారు రూ. 48 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను నేరుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం. థామస్ మాట్లాడుతూ.. అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతూ, భారీ ఖర్చులతో వైద్యం చేయించుకున్న నిరుపేద కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా ఈ నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. షణ్ముగ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం



**పలమనేరు , మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు మండలంలో నిర్వహించనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పరీక్షలు మార్చి16, 2026 నుంచి ఏప్రిల్ 1వ తేది వరకు జరుగుతాయి. మండలంలోని 8 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1493 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కేంద్రాల వారీగా విద్యార్థుల వివరాలు ఇలవే ఉన్నాయి. జడ్పీహెచ్ఎస్, పెంగరగుంట-221 జడ్పీహెచ్ఎస్, కొలమాసనపల్లి -213, జడ్పీహెచ్ఎస్, ఉర్దూ పలమనేరు-141, జి హెచ్ ఎస్, పలమనేరు -223, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పలమనేరు- 197 ఎలెనా బెట్టిని ఈ.ఎం స్కూల్ -180 ఓ ఎల్ ఎల్ ఈ.ఎం స్కూల్ -170 వాణి విద్యాశ్రమం ఈ.ఎం స్కూల్-149 మంది. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు విద్యుత్తు, డెస్కులు టాయిలెట్ వంటి ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది ఇన్విజిలెటర్స్ పోలీసు భద్రత ఫ్లైయింగ్ స్క్వాడ్లు సిట్టింగ్ స్కోడ్ చీఫ్ సూపరేండెంట్,డిపారెంటల్ ఆఫీసర్స్, ఆరోగ్య సిబ్బందిని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని విద్యార్థులు సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని పోలీసులు సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగేందుకు అందరూ సహకరించాలని ఎంఈఓ లీలారాణి,ఎంఈఓ 1 బాలసుందరం కోరారు.

## ఉగాది పురస్కారాలు అందుకున్న విద్యార్థులు



**గంగవరం, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పరాభవనామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని గంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్ లో శుక్రవారం తెలుగు పద్యాలు చెప్పడం వ్రాయడం లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సబ్ జూనియర్స్ విభాగం(1,2తరగతులు)లో ప్రథమ బహుమతి స్వరూప - నల్లగుట్లపల్లి, ద్వితీయ బహుమతి జయకృష్ణ - కీలపట్ల, తృతీయ బహుమతి తనుశ్రీ - సరమట్లపల్లి సాధించారు. జూనియర్స్ విభాగం (3,4,5 తరగతులు)లో ప్రదమస్థానం తన్మయి - నల్లగుట్ల పల్లి, ద్వితీయ స్థానం చరణ్ - జి.ఎల్.ఎస్.ఫారం, తృతీయ స్థానంలో ధనన్ సాయి - నల్లగుట్లపల్లి,చతుర్ధ స్థానం ధరణి - పత్తికొండ నిలిచారు. అలాగే వ్యాసరచన పోటీలలో సీనియర్స్ విభాగం (6,7,8 తరగతులు) ప్రథమ ద్వితీయ తృతీయ చతుర్ధ స్థానాలుగా బిందుశ్రీ - కె.జి.బి.వి. పాఠశాల, భావన-గంగవరం హైస్కూల్,జాహ్నవి- జి.ఎల్.ఎస్. ఫారం, సుప్రియ - గంగవరం హై స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. విజేతలకు ఎంఈఓ - 2 శ్రీనివాసులు, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు చంగల్ రెడ్డి చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు,మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమం తెలుగు సాహిత్య సాశీస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరుగగా అధ్యక్ష కార్యదర్శిలు తులసీనాధం నాయుడు, పుష్పలు కార్యక్రమ నిర్వాహకులుగా వ్యవహించి సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో 100 మంది విద్యార్థులు పాల్గొనగా పలువురు ఉపాధ్యాయ బృందం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

## రైతులను అన్ని విధాల అభివృద్ధి చేయడమే ఎన్డీఏ కూటమి లక్ష్యం

### - రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్

**పుంగనూరు , మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీఎం కిసాన్ , అన్నదాత సుఖీభవ నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల ఖాతాలలో నిధులు విడుదల సందర్భంగా ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని రైతులకు 21.23 కోట్ల రూపాయల చెక్కును పంపిణీ చేశారు ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యం అన్నారు. ఏ డి. ఎస్ శివకుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సమీపతి యాదవ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు

## ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



**పలమనేరు , మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వజ్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కవయిత్రి మొల్ల జయంతిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశులు అధ్యక్షతన తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ నేటితరం స్త్రీలకు విద్యార్థులకు కవియిత్రి మొల్ల ఆదర్శమని చదువు ప్రాధాన్యత లేని రోజుల్లోనే మొల్ల గొప్ప కావ్యమైన రామాయణాన్ని రచించడం స్త్రీ జాతికి గర్వకారణమన్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు ఉద్బోధించారు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నందీశ్వరయ్య మాట్లాడుతూ... కుమ్మరి కులంలో జన్మించిన మొల్ల తండ్రి చదువుకోకపోయినా కుటుంబ పరిస్థితులు సరిగా లేకపోయినా తాను రామాయణ కావ్యాన్ని రచించాలనే సంకల్పంతో ముందుకు సాగారన్నారు. పట్టుదలతో కొద్ది రోజులలోనే కావ్యాన్ని రచిం చారని, ఆమె జీవితం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యాన్ని సాధించాలనే సంకల్పం ఉంటే ఎవరైనా సాధించవచ్చునని. దీనికి నిదర్శనం మొల్ల జీవితమని తెలిపారు. తెలుగు విభాగధిపతి డాక్టర్ ఇ వాసు మాట్లాడుతూ. చిన్నతనం లోనే తల్లి మరణించిన తండ్రి సంరక్షణలో పెరుగుతూ చదువు అంతంత మాత్రమే నైనా తమ కులదైవం శ్రీ గోపురపు శ్రీ కంఠ మల్లేశ్వర స్వామి అనుగ్రహంతో రామాయణ కావ్యాన్ని మొల్ల రచించారని, ఆరు రోజుల్లో871 పద్యాలతో 6 ఖండాలతో పూర్తి చేశారన్నారు. విద్యార్థులు చిన్నచిన్న కష్టాలకు కృంగిపోకుండా ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ సురేష్ బాబు, అధ్యాపకులు డాక్టర్ వెంకటేష్ బాబు, కిరణ్ బాబు, ఇంతియాజ్ తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్స్ సేవలు అమూల్యమైనవి



**పులిచెర్ల, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రోగుల ఆరోగ్య పరిస్థితిని సరిగ్గా అంచనా వేయడానికి ల్యాబ్ టెక్నీషియన్స్ అందించే నివేదికలు,వారి సేవలు అమూల్యమైనవని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ప్రశంసించారు. ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ జయప్రకాష్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఆరోగ్య రంగర్థలో ల్యాబ్ టెక్నీషియన్లు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. రోగ నిర్ధారణకు అవసరమైన రక్తం, మూత్రం, కఫం మరియు ఇతర పరీక్షలను ఖచ్చితంగా నిర్వహించడం ద్వారా వైద్యులు సరైన నిర్ధారణ చేయడంలో కీలక సహకారం అందిస్తున్నారన్నారు. వివిధ అంటువ్యాధుల నియంత్రణ, గర్భిణీ ల పరీక్షలు, మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపులో ముఖ్యమైన సేవలు అందిస్తున్నారని, వారి కృషి వల్ల సమయానికి సరైన చికిత్స అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం సాధ్యమవుతుందని తెలియజేశారు. ప్రత్యేకంగా ప్రభుత్వ ఆరోగ్య సేవలలో ల్యాబ్ టెక్నీషియన్లు గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన పరీక్షా సేవలను అందిస్తూ ఆరోగ్య సేవల బలోపేతానికి తోడ్పడుతున్నారని, వారి అంకితభావం, కృషి మరియు నైపుణ్యం ఆరోగ్య వ్యవస్థకు బలమైన ఆధారమని కొనియాడారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్లందరికీ అభినందనలు తెలియజేస్తూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వారు ఇలాగే మరింత సేవలందించాలని అభిలాషించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ నర్స్ శ్రీదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు ప్రమీల, పురుషోత్తం మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అధిక ఉష్ణోగ్రతల నుంచి పంటల సంరక్షణకు రైతులు జాగ్రత్తలు పాటించాలి

**కలికిరి, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ సంవత్సరం మార్చి నుంచి మే 2026 వరకు దేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం కంటే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు పంటల సంరక్షణలో జాగ్రతలు పాటించాలని కెవికె సమన్వయ కర్త డాక్టర్ కె మంజుల సూచించారు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యంగా అన్నమయ్య, కర్నూలు, కడప, అనంతపురం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, మార్కాపురం, శ్రీకాకుళం జిల్లాల్లో మార్చి నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్నమయ్య జిల్లా రైతులు వేడిగాలుల ప్రభావం నుంచి పంటలను రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ కె. మంజుల మరియు శాస్త్రవేత్తలు సూచించారు.పంటలకు నీటిని ఉదయం లేదా సాయంత్రం సమయంలో అందించడం మంచిదని, నీటి వసతిని బట్టి పొలాల్లో తడి నిల్వ ఉండేలా చూడాలన్నారు. స్ప్రింక్లర్ లేదా రైన్ పైపుల ద్వారా నీటిని అందించడం అధిక ఉష్ణోగ్రతల సమయంలో అనుకూలమని చెప్పారు.పొలాల్లో గడ్డి, పంట వ్యర్థాలను పరిస్తే నేలలో తడి ఎక్కువకాలం నిల్వ ఉండి నీటి ఆవిరి తగ్గుతుందని, దీని వల్ల పంటలు పచ్చగా ఉంటాయని వివరించారు. సేంద్రీయ ఎరువులైన చివికిన పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్ వాడడం ద్వారా నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి మొక్కలకు అవసరమైన పోషకాలు అందుతాయని తెలిపారు.సమస్యాత్మక కలుపు మొక్కైన పార్థీనియం (ముక్కుపూల మొక్క) పొలాల్లో లేకుండా చూడాలని, తీసిన మొక్కలను కాల్చివేయాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పచ్చదోమ, పేను, తామర పురుగులు, తెల్ల దోమ, మైట్ వంటి రసం పీల్చే పురుగులు పెరిగే అవకాశం ఉన్నందున వేప కొమ్మల ద్రావణం లేదా వేపనూనె (10,000 పీపీఎం) 1 మిల్లీ లీటర్ చొప్పున లీటరు నీటిలో కలిపి 20 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలని చెప్పారు.అలాగే పసుపు, నీలం రంగుల జిగురు అట్టలను ఎకరాకు 20 నుంచి 30 వరకు అమర్చితే రసం పీల్చే పురుగులను నియంత్రించవచ్చని తెలిపారు. వరి పంటలో అజోల్లాను ఎకరాకు 8 నుంచి 10 కిలోల చొప్పున వేస్తే నత్రజని అందించడంతో పాటు నీటి అవసరం తగ్గుతుందని చెప్పారు.పంటలు అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు పొటాషియం నైట్రేట్ (13:0:45) లేదా 19:19:19 ఎరువును 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి ఒకసారి పిచికారీ చేయాలని సూచించారు. మామిడి వంటి తోట పంటలలో పెరుగుతున్న కాయలకు ఫ్రూట్ కవర్లు కట్టడం వల్ల అధిక ఉష్ణోగ్రతల ప్రభావం తగ్గి కాయ నాణ్యత కాపాడబడుతుందని తెలిపారు.బొప్పాయి, టమాట, మిరప మరియు పూల తోటలలో నేల ద్వారా వచ్చే వేరుకుళ్ళు వ్యాధులను నివారించేందుకు ట్రైకోడెర్మా, సూడోమోనస్ వంటి జీవ శిలీంధ్రనాశకాలను ఎకరాకు 1 నుంచి 2 లీటర్ల చొప్పున డ్రిప్ ద్వారా లేదా పేడ ఎరువులో కలిపి ఉపయోగించాలని సూచించారు.అలాగే కాయలు, కొమ్మలను దెబ్బతీసే గొంగళి పురుగులను నియంత్రించేందుకు స్పైనోసాడ్, స్పైనటోరమ్ వంటి పర్యావరణ హిత మందులను ఉపయోగించాలని శాస్త్రవేత్తలు తెలిపారు.

## ములకలచెరువు రైల్వే స్టేషన్‌లో అకోలా రైలు స్టాపింగ్

**–వ్యాపారస్తులు, ప్రజలకు సౌకర్యం - సుగవాసి ప్రసాద్, సాయి లోకేష్**



**ములకలచెరువు,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల ప్రయాణ కష్టాలు తీరుస్తూ, ములకలచెరువు రైల్వే స్టేషన్‌లో అకోలా రైలు స్టాపింగ్ సౌకర్యంతో వ్యాపారస్తులు, రైలు ప్రయాణం చేసే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు సుగువాసి ప్రసాద్ బాబు, అన్నమయ్య జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు సాయి లోకేష్, జనసేన పార్టీ తంబళ్లపల్లి నియోజకవర్గం ఇన్చార్జి పోతుల సాయినాథులు తెలిపారు. శుక్రవారం ములకలచెరువు మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్లో తిరుపతి నుండి అకోలా కు వెళ్లే ఎక్స్ప్రెస్ ములకలచెరువు రైల్వే స్టేషన్లో స్టాపింగ్ అధికారకంగా రావడం జరిగింది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల 20 నిమిషాలకు ములకలచెరువు రైల్వే స్టేషన్ కు వచ్చిన అకోలా రైలుకు పెద్ద ఎత్తున కూటమి నాయకులు హాజరై రైలుకు స్వాగతం పలికారు. రైలు డ్రైవర్లు గార్డుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబుఈ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి రైలు స్టాపింగ్ మంజూరు చేసిన కేంద్ర రైల్వే శాఖకు, సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ సాయి లోకేష్ జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ సాయినాథ్ మాట్లాడుతూ ఈ స్టాపింగ్ వల్ల వ్యాపారులు, విద్యార్థులు మరియు సామాన్య ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యావరణ కార్పొరేషన్ చైర్మన్ దినేష్ రెడ్డి పౌరసరఫరాల రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్ తాజ్, టిడిపి నాయకులు కట్టా దొరస్వామి నాయుడు, బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, టిడిపి రాష్ట్ర బీసీ అధికార ప్రతినిధి, చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు, టిడిపి పార్లమెంట్ కార్యదర్శి మాజీ సర్పంచ్ ఎర్రగుడి సురేష్, బిజెపి పార్టీ జిల్లా నాయకులు గోపాల్ రెడ్డి, టిడిపి మలకలచెరువు మండల కన్వీనర్ సిద్ధప్ప, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కె.వి రమణ, పెద్ద ఎత్తున కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి, పలువురికి గాయాలు





**ములకలచెరువు , మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎదురురిదురుగా రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, మరి కొంతమందికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు వివరాలీలావున్నాయి. అనంతపురం జిల్లాకు చెందిన ఆదిలక్ష్మికి పలమనేరు దగ్గర విరూపాక్షపురం నందు పక్షవాతానికి మందు తీసుకోవడం కోసం అనంతపురం నుండి గురువారం టయోటా కారులో డ్రైవర్ ఖాదరవల్లి తో పాటుగా, మురళి మరియు వనజాక్షలు బయలుదేరి వెళ్తుండగా, అదే సమయంలో ఖాళీ క్రేట్లతో కదిరి వైపు వస్తున్న బులోరో వాహనం ములకలచెరువు సమీపంలోని జాతీయ రహదారి, గాలేటి వారి పల్లి వద్ద అర్ధరాత్రి 12 గంటల సమయంలో వాహనాలు రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఖాదరవల్లి, ఆదిలక్ష్మి లు మృతి చందగా, బొలెరో వాహనం డ్రైవర్ బాలాజీ నాయక్, మురళి, గంగాధర్, వనజాక్షలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మదనపల్లి హరి ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. ములకలచెరువు ఎస్ఐ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



# అన్నమయ్య జిల్లా

## మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో విద్యార్థుల ఫ్లాష్ మాబ్

**-హాజరైన మిట్స్ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్: ఎన్. విజయ భాస్కర్ చౌదరి**

**- అశ్వ 2026 - జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్‌కు హాజరుకానున్న హీరో శర్వానంద్**



**మదనపల్లె/ కురబలకోట, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు అశ్వ 2026 – జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ లో భాగంగా విద్యార్థులు ఫ్లాష్ మాబ్ ను ఏర్పాటు చేసి వివిధ రకాల సాంగ్స్ కు డాన్స్ చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిట్స్ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్: యెన్, విజయ భాస్కర్ చౌదరి ప్రో– ఛాన్సలర్ యెన్. ద్వారకానాథ్ లు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మిట్స్ వర్సిటీ వైస్ ఛాన్స లర్ డాక్టర్: సి. యువరాజ్ మాట్లాడుతూ ఈ నెల 25 మరియు 26 వ తేదీలలో రెండు రోజుల పాటు యూనివర్సిటీ నందు వివిధ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో జాతీయ స్థాయిలో డిప్లొమా, ఇంజనీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని, వివరాలు కళాశాల అశ్వ వెబ్ సైట్ www.ashv2k.in లేదా www.mits.ac.in లో పొందుపరిచామని ఆయన అన్నారు.ఈ వెబ్ సైట్ నందు రిజిస్ట్రేషన్ వివరాలు మరియు పోటీలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమం లో ప్రతి ఏటా సినీ ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అలరిస్తారని అన్నారు.ఈ సారి 26 వ తేదీన సినీ హీరో శర్వానంద్ మరియు 25 న నేపథ్య గాయకులు సాగర్, లిప్సిక భాష్యం మరియు మౌనిక యాదవ్ లు నేపథ్య గాయకులు మరియు జబర్దస్త్ టీం మెంబెర్స్ పాల్గొంటారని డాక్టర్. సి.యువరాజ్ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్: పి. రామనాథన్ , అశ్వ – 2026 కన్వీనర్ మరియు వైస్ ప్రిన్సిపాల్ కమాల్ బాషా, కో – కన్వీనర్ ప్రదీప్ కుమార్ స్టూడెంట్ కో– ఆర్డినేటర్స్ హర్ష , జయరాం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విధాత చిత్రం వీక్షించిన సాయి విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు

**- హీరోగా డాక్టర్. అప్పినపల్లి భాస్కరాచారి నటన అద్భుతం**



**మదనపల్లె, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డాక్టర్. అప్పినపల్లి భాస్కరాచారి హీరోగా నటించడంతోపాటు నిర్మాతగా వ్యవహరించి ఏ బి సి ప్రొడక్షన్స్ పై నిర్మించిన విధాత చిత్రాన్ని నీరు గట్టు వారి పల్లె నందుగల సాయి విద్యానికేతన్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రెడ్డెప్ప,ఉపాధ్యాయులు ప్రతాప్,అమీన్,హైమావతి, మంజుల, అనసూయ, పవిత్ర,పార్వతి 250 మంది విద్యార్థులు వీక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామా లను కళ్లకు కట్టినట్లు విధాత చిత్రాన్ని తెరకెక్కించారని అభినందించారు. అదేవిధంగా హీరోగా నటించిన డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి నటన అద్భుతంగా ఉందని కితాబునిచ్చారు.మదనపల్లె పరిసర ప్రాంతాలను దర్శకుడు మణికంఠ రాజేంద్ర చక్కగా చూపించారని కొనియాడారు. ఏబీసీ ప్రొడక్షన్స్ పై మరిన్ని మంచి సినిమాలు తెరకెక్కించాలని ఆకాంక్షించారు.

## అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

**- పీఎం-కిసాన్ అన్నదాత సుఖీభవతో రైతులకు భరోసా: టిడిపి నాయకులు ప్రశంసలు**



**మదనపల్లె, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ పీఎం – కిసాన్ అన్నదాత సుఖీభవతో రైతులకు భరోసా కల్పిస్తోందని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రశంసించారు. శుక్రవారం రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్,రూరల్ అధ్యక్షుడు దేవరింటీ శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల అరుణ్ తేజ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగుర్ వలి (షో ఆఫ్ శీనా)ల సంయుక్త ఆధ్వర్యంలో కూటమి నాయకులతో కలిసి రాజంపేట పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో ఏపీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రైతన్నలకు ఉగాది కానుకగా అన్నదాత సుఖీభవ– పీఎం కిసాన్ పథకం మూడో విడత నిధులను వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. అలాగే రైతన్నలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వ్యవసాయాన్ని బలోపేతం చేసే దిశగా అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం నిజంగా రైతులకు వరమని వారు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయి బ్రాహ్మణ నాయకులు మంగళ ప్రభాకర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ముద్దుకృష్ణ నాయుడు,మడికయ్యల శివాలయం డైరెక్టర్ కళిశం ప్రకాష్ నాయుడు,యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ధన యాదవ్, ప్రణయ్ రాయల్ పాల్గొన్నారు.

## పిఎం విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్ - కమ్ - ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా రెవెన్యూ అధికారి, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్



**మదనపల్లె, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎంఎస్ఎంఈ –డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్ ( ఎంఎస్ఎంఈ – డిఎఫ్ఓ ) విశాఖపట్నం ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ( డిఐసి ) డి ఆర్ డి ఏ మరియు మెప్మా అన్నమయ్య జిల్లా సహకారంతో మదనపల్లెలో నిర్వహిస్తున్న పీఎం విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్ – కమ్ –ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి మరియు ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదనరావు ప్రారంభించారు. సీటీఎం రోడ్ వద్ద ఉన్న పద్మావతి కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా రెవెన్యూ అధికారి , ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ ప్రారంభించి స్టాళ్లను సందర్శించి కళాకారుల ఉత్పత్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకం ద్వారా సంప్రదాయ వృత్తుల కళాకారులకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందుతుందని తెలిపారు. ఇలాంటి ఎగ్జిబిషన్లు నిర్వహించడం ద్వారా కళాకారుల హస్తకళా ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు పెరిగి వారి జీవనోపాధి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. మార్చి 13 నుండి 15 వరకు మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.ఈ ఎగ్జిబిషన్ ద్వారా హస్తకళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడమే కాకుండా తయారీదారులు,వ్యాపారులు మరియు వినియోగదారులు పరస్పరం ప్రత్యక్షంగా కలుసుకునే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్ డైరెక్టర్ ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ, డిసి., ప్రాజెక్ట్ డైరెక్టర్ మెప్మా పి.లక్ష్మీదేవి, ప్రాజెక్ట్ డైరెక్టర్ డిఆర్డిఏ నాగేశ్వరరావు , ఆర్ సంజయ్ కుమార్ జాయింట్ డైరెక్టర్ ఎం.ఎస్.ఎం.మీ డిఎఫ్ఓ విశాఖపట్నం, ఎల్డిఎం జి.ఆంజనేయులు, టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్, డాక్టర్ రాటకొండ గురు ప్రసాద్ కరస్పాండెంట్ అండ్ మెంబర్ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి, పవన్ కుమార్ డైరెక్టర్ ఆర్.ఎస్.ఈ.టి.ఐ. ఎం నాగార్జున సీనియర్ మేనేజర్ ఐపిపిబి, విజయ్ విహారి డిప్యూటీ డెవలప్మెంట్ మేనేజర్ నాబార్డ్, తదితర సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## కంటి చూపును పోగొట్టే నిశ్శబ్ద వ్యాధి గ్లకోమా:డాక్టర్ శ్రీగిరీష

**పీలేరు, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకుండా శాశ్వత అంధత్వానికి దారితీసే గ్లకోమా వ్యాధి పై అవగాహన అందరికి అవసరమని తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారిణి డా:శ్రీగిరీష అన్నారు.గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం "కంటి సమస్యలు –జాగ్రత్త" అంశంపై అవగాహన కల్పిస్తూ తలుపుల పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేసుకోవడం వల్ల గ్లకోమా ను ముందుగా గుర్తించి మందుల ద్వారా లేదా శస్త్రచికిత్స ద్వారా కంటి చూపును కోల్పోకుండా కాపాడుకోవచ్చునని ఆమె పేర్కొన్నారు.ముందస్తు లక్షణాల్లో భాగంగా కంటినొప్పి, అస్పష్టమైన చూపు,చూపు క్రమంగా తగ్గడం,తీవ్ర కంటి,తలనొప్పి గ్లకోమా వ్యాధికి ప్రాథమిక లక్షణాలు కావచ్చునన్నారు.మధుమేహం, అధిక రక్తపోటు, 40సంవత్సరాల పైబడినవారు, కుటుంబం లో వ్యాధిచరిత్ర గలవారు ఈ వ్యాధిపట్ల అధిక జాగ్రత్త కలిగి ఉండాలని డా:శ్రీగిరీష ప్రజలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య ఏయన్ యం వసుందర,స్టాఫ్ నర్స్ శిరీష,లాబ్ టెక్నిషన్ కుమార్,సిహెచ్ఓ కుముద, ఫార్మసీస్ట్ ప్రభావతి ప్రజలు పాల్గొన్నారు.

## పిన్ క్లిక్ కంపెనీలో ఉద్యోగాలకు విశ్వం విద్యార్థుల ఎంపిక

**- ఎంపికైన వారికి రూ.7.8 లక్షల వార్షిక వేతనం**

**- విద్యాసంస్థల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి హర్షం**



**మదనపల్లె/ కురబలకోట, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విశ్వం ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రముఖ రియల్ ఎస్టేట్ పిన్ క్లిక్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.కంపెనీ శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా రెడ్డి ప్రసాద్,సాయితేజ,రవితేజ అనే విద్యార్థులు (ప్రాపర్టీ అడ్వైజర్) పదవికి ఎంపికయ్యారు.వీరికి వార్షికంగా రూ. 7.8 లక్షల సీటీసీతో ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు.ఎంపికైన విద్యార్థులు బెంగళూరులోని పిన్ క్లిక్ కంపెనీలో తమ సేవలను అందించ నున్నారు. విద్యార్థులు సాధించిన ఈ విజయంపై కళాశాల యాజమాన్యం ఎం.ప్రభాకర్ రెడ్డి,ప్రిన్సిపాల్ డాక్టర్: డి.రమణారెడ్డి,ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ జి.ఎల్ మీనా,ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.విద్యార్థుల ప్రతిభ,కృషి మరియు కళాశాల అందిస్తున్న నాణ్యమైన శిక్షణ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని వారు వెల్లడించారు.

## కూటమి ప్రభుత్వం... రైతు సంక్షేమ ప్రభుత్వం

**- ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా పిఎం కిసాన్**

**-అన్నదాత సుఖీభవ నగదు జమ**

**- ఏఎంసీ చైర్మన్ జంగాల శివరాం రాయల్**




**మదనపల్లె, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని, అన్నదాతలకు అండగా నిలవడానికి అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.6 వేలు జమ చేయడం ద్వారా రైతాంగానికి ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసినట్లని ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్ అభివర్ణించారు.శుక్రవారం బిడిఎస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ నిధులు విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ కార్యక్రమం లో రైతులకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా, ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్ చేతులమీదుగా మెగా చెక్కు పంపిణీ చేయడం జరిగింది. రైతులను ఉద్దేశించి మదనపల్లె ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్ మాట్లాడుతూ రైతుల కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. రైతుల ఆదాయం పెంచడం, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్‌ల సమస్యల పరిష్కారానికి ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాజలేని పోరాటం

**- మార్చి 31న అన్నమయ్య జిల్లా మొదటి మహాసభ**



**మదనపల్లె, మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్చార్జ్ కవరకుంట్ల జయరాజ్ తెలిపారు. మదనపల్లె లో అన్నమయ్య జిల్లా కన్వీనియం కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జయరాజ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న ఇంటి స్థలాలు, మీడియా కమిషన్ ఏర్పాటు, పెన్షన్ సౌకర్యం జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య పంటి హక్కుల సాధనకు ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాటాల నిర్వహిస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సహకారంతో మార్చి 4న జరిగిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. వేలాదిమంది జర్నలిస్టులు విజయవాడ నగరం వీధుల్లో హక్కుల సాధనకు గళమెత్తారని వివరించారు. చలో విజయవాడ కార్య క్రమానికి హాజరైన సమాచార శాఖ మంత్రి పార్థసారథి జర్నలిస్టుల సమస్యలపై సాను కూలంగా స్పందించారని వివరించారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వివరించారు. సంస్థాగతంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ను బలోపేతం చేసేందుకు స్థానిక నాయకత్వం కృషి చేయాలని వివరించారు. అనంతరం సమావేశం మార్చి 31న మదనపల్లె నగరంలో అన్నమయ్య జిల్లా మొదటి మహాసభ నిర్వహిస్తున్నట్లు తీర్మానించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రులు, శాసన సభ్యులు, ప్రతిపక్ష నేతలను ఆహ్వానించాలని సమావేశం తీర్మానించింది. కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ రమేష్ బాబు, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ప్రసాద్ ల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమా వేశానికి కో కన్వీనర్లు రామకృష్ణ రెడ్డి, నాగరాజు, హిదాయతుల్లా (అప్పు) శ్రీనివాసులు, జాకీర్, చంద్ర, చిత్తూరు జిల్లా కార్యదర్శి షేక్ సలీం, చిత్తూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గిరిశేఖర్, పుంగనూరు నియోజక వర్గం అధ్యక్ష కార్యదర్శులు సైఫుల్లా, డాక్టర్ తల్లా శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు మంజునాద్, కార్తీక్, రవి తేజ, గంగాధర్ లు హాజరయ్యారు.

## బంధువుల శుభకార్యంలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్



**ములకలచెరువు,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యసాయి జిల్లా, రాప్తాడు నియోజక వర్గం ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ కుమారుడు పరిటాల శ్రీరామ్ శుక్రవారం ములకలచెరువు లోని బంధువుల శుభకార్యములో పాల్గొన్నాడు. ములకలచెరువు లోని టమోటా మండి, కేజీఎన్ ఫంక్షన్ హాల్ యజమాని కట్ట గోవింద నాయుడి మనవరాలు నామకరణం సందర్భంగా పరిటాల శ్రీరామ్ కుటుంబ సమేతంగా వచ్చి చిన్నారిని ఆశీర్వదించారు. పరిటాల శ్రీరామ్ రావడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయనను కలిసి పూలమాలలతో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టమోటా మండి, కేజీ అండ్ ఫంక్షన్ హాల్ యజమాని కట్టా గోవిందు నాయుడు, టిడిపి నాయకులు కట్టా దొరస్వామి నాయుడు, శ్రీనివాస నాయుడు మునీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

## రావిపూడి... థియేటర్లలోనే కాదు టీవీలోనూ కింగే



అనిల్ రావిపూడిని టాలీవుడ్లో అందరూ హిట్ మెషీన్ అంటారు. తన సినిమాల ఫలితాలను చూస్తే.. ఇందులో అతిశయోక్తి ఏమీ లేదనిపిస్తుంది. దర్శకుడిగా తన తొలి చిత్రం 'పటాస్' పెద్ద బ్లాక్‌బస్టర్. లేటెస్ట్‌గా ఆయన్నుంచి వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' రీజనల్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. మధ్యలో అనిల్ తీసిన సుప్రీమ్, రాజా ది గ్రేట్, ఎఫ్-2, సరిలేరు నీకెవ్వరు, ఎఫ్-3, భగవంత్ కేసరి, సంక్రాంతికి వస్తున్నాం.. వీటిలో హిట్లు, సూపర్ హిట్లు, బ్లాక్‌బస్టర్లు ఉన్నాయి. అనిల్ సినిమాలు థియేటర్లలో ఇరగాడడమే కాదు.. టీవీల్లోనూ అంతే మంచి ఫలితాన్ని అందుకున్నాయి. తన సినిమాల టీఆర్పీ రేటింగ్స్ చూస్తే అవి ఏ స్థాయిలో టీవీ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయో అర్థమవుతుంది. అనిల్ రావిపూడి సినిమాల్లో అత్యధిక టీఆర్పీ తెచ్చుకున్న సినిమా.. మహేష్ బాబు హీరోగా నటించిన 'సరిలేరు నీకెవ్వరు'. ఆ సినిమాకు రికార్డు స్థాయిలో 24.2 టీఆర్పీ వచ్చింది. ఆ తర్వాత విక్టరీ వెంకటేష్ మూవీ అత్యధికంగా 18.6 రేటింగ్ సాధించింది. వెంకీతో అనిల్ చేసిన లేటెస్ట్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం' 18.3 రేటింగ్ సాధించింది. టీఆర్పీ రేటింగ్స్ గత కొన్నేళ్లలో బాగా పడిపోయాయి. అయినా సరే ఈ చిత్రానికి గత ఏడాది ఈ స్థాయిలో రేటింగ్ రావడం విశేషమే. రవితేజ సినిమా 'రాజా ది గ్రేట్'కు 18.4 టీఆర్పీ వచ్చింది. అది కూడా సూపర్ రేటింగే. 'సుప్రీమ్' సినిమాతో అనిల్ రావిపూడి 15.4 రేటింగ్ సాధించాడు. ఇక ఈసారి సంక్రాంతి వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రాన్ని థియేటర్లలో జనం ఎలా ఎగబడి చూశారో తెలిసిందే.

అయినా సరే అది టీవీలో 14.2 రేటింగ్ సాధించడం విశేషం. అనిల్ రావిపూడి చిత్రాల్లో అతి తక్కువగా ఆడింది ఎఫ్-3 మూవీ. దానికి టీఆర్పీ 9.3 వచ్చింది. పటాస్ కూడా అంతే రేటింగ్ సాధించింది. భగవంత్ కేసరి 9.9 రేటింగ్ తెచ్చుకుంది. అనిల్ మిగతా చిత్రాలతో పోలిస్తే ఈ రేటింగ్స్ తక్కువే కానీ.. మామూలుగా చూస్తే మాత్రం అవి కూడా మంచి టీఆర్పీలే. మొత్తంగా చూస్తే అనిల్ సినిమాలను థియేటర్లలోనే కాదు.. టీవీల్లోనూ జనం విరగబడి చూస్తున్నారని ఈ రేటింగ్స్ చూస్తే అర్థమవుతుంది.

## రష్మిక అంత టార్చర్ అనుభవించిందా?



కన్నడలో 'కిరిక్ పార్టీ' అనే చిన్న సినిమాతో కెరీర్‌ను మొదలుపెట్టి.. ఇప్పుడు ఇండియాలోనే టాప్ హీరోయిన్లలో ఒకరిగా ఎదిగింది రష్మిక మందన్నా. పాన్ ఇండియా స్థాయిలో సంచలనం రేపిన పుష్ప, పుష్ప-2, యానిమల్, ఛావా చిత్రాల్లో ఆమె కథానాయికగా నటించింది. కొన్నేళ్లుగా ఇండియన్ స్క్రీన్ మీద తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్న ఆమె.. ఇటీవలే విజయ్ దేవరకొండను పెళ్లి చేసుకుని వ్యక్తిగత జీవితంలోనూ స్థిరపడింది. ఇలా చాలా హ్యాపీగా ఉన్న సమయంలో రష్మిక గురించి అనవసర చర్చ జరుగుతోంది సోషల్ మీడియాలో. రష్మిక తల్లికి సంబంధించిన 8 ఏళ్ల నాటి ఆడియో క్లిప్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. దాని మీద సీరియస్ అయిన రష్మిక.. పాత విషయాలను సామాజిక మాధ్యమాల్లోకి తెచ్చి ఇబ్బంది పెట్టడం గురించి ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే ఈ పోస్టులను సోషల్ మీడియా నుంచి తప్పించాలని డిమాండ్ చేసింది. ఇంతకీ ఆ ఆడియోలో రష్మిక తల్లి ఏమందన్నది ఆసక్తికరం. 'కిరిక్ పార్టీ' హీరో, నిర్మాత రక్షిత్ శెట్టితో రష్మికకు ఎనిమిదేళ్ల కిందట నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. అప్పటికి రష్మిక వయసు 19 ఏళ్లే. రక్షిత్‌కు అప్పటికే 32 ఏళ్లు వచ్చాయి. ఐతే ఈ రిలేషన్‌షిప్‌లో రష్మిక ఏమాత్రం సంతోషంగా లేదని.. రక్షిత్ కుటుంబం పెట్టిన ఆంక్షలతో బాగా ఇబ్బంది పడిందని.. తన తల్లి ఆడియో కాల్‌ను బట్టి అర్థమవుతోంది. 'గీత గోవిందం' సినిమాలో లిప్ లాక్ సీన్ చేసినందుకు.. రక్షిత్ కుటుంబం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందని.. ఇందుకు ప్రతిగా ప్రెస్ మీట్ పెట్టి తాను పెళ్లి తర్వాత సినిమాల నుంచి తప్పుకుంటున్నట్లు స్టేట్మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేసిందని.. అంతేకాక రక్షిత్ కుటుంబానికి రష్మిక తల్లి క్షమాపణ చెప్పాలని కూడా షరతు పెట్టిందని ఈ ఆడియో కాల్ ద్వారా అర్థమవుతోంది. ఆ సమయంలో రష్మికకు రక్షిత్ ఎంతమాత్రం మద్దతుగా నిలవలేదని.. అతడి తల్లి రష్మికతో, ఆమె కుటుంబంతో చాలా దురుసుగా వ్యవహరించిందని.. ఈ ఆడియో క్లిప్ స్పష్టం చేసింది. మొత్తంగా చిన్న వయసులో తెలిసీ తెలియక రక్షిత్‌తో ఎంగేజ్మెంట్ చేసుకున్న రష్మిక.. దాని వల్ల చాలా ఇబ్బంది పడిందని.. అందుకే ఎంగేజ్మెంట్ రద్దు చేసుకుని తనకు నచ్చినట్లు కెరీర్‌ను తీర్చిదిద్దుకుందని రష్మిక అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ముందు రక్షిత్ బాధితుడంటూ అతడి మీద సానుభూతి చూపిస్తూ, రష్మికను ఎటాక్ చేసేవాళ్లు కన్నడ జనం. కానీ ఇప్పుడు సోషల్ మీడియాలో తిరుగుతున్న క్లిప్ చూశాక పరిస్థితి అందుకు విరుద్ధమని అర్థమవుతోంది.

## 'కల్కి'పై విమర్శలకు కట్టుబడి ఉన్న లిరిసిస్ట్



ప్రభాస్ కెరీర్లో 'బాహుబలి-2' తర్వాత అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచిన 'కల్కి' మెజారిటీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. కేవలం రెండు సినిమాల అనుభవంతో నాగ్ అశ్విన్ ఆ చిత్రాన్ని ఎవ్వరూ ఊహించనంత గ్రాండ్‌గా, ఒక విజువల్ వండర్‌గా తీర్చిదిద్దాడు. పురాణాలను భవిష్యత్తుకు ముడిపెట్టి రూపొందించిన కథ ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని పంచింది. కానీ ఆ సినిమా మీద కొన్ని విమర్శలూ తప్పలేదు. ముఖ్యంగా కర్ణుడి పాత్రను ప్రెజెంట్ చేసిన విధానం పట్ల ఒక వర్గం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ప్రభాస్ చేసిన కర్ణుడి పాత్రను ఎలివేట్ చేయడం కోసం అర్జునుడి పాత్రను తక్కువ చేసి చూపారన్నది వారి అభ్యంతరం. దుష్టుడైన దుర్యోధనుడి పంచన చేరి పాపాలు చేసిన కర్ణుడిని చాలా సినిమాల్లో చాలా గొప్పవాడిగా చూపించి జనాలకు ఆ పాత్ర మీదే వేరే అభిప్రాయం కలిగేలా చేశారన్నది ఎప్పట్నుంచో ఉన్న వాదన. 'కల్కి' రిలీజ్ టైంలో ఈ చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. టాలీవుడ్లో ప్రముఖ గేయ రచయితల్లో ఒకరైన అనంత శ్రీరామ్.. 'కల్కి'లో కర్ణుడి పాత్రను ప్రెజెంట్ చేసిన తీరును అప్పట్లో తప్పుబట్టాడు. ఇప్పుడు మరోసారి ఆయన ఆ టాపిక్ మీద మాట్లాడాడు. తన మాటలకు ఇప్పటికీ కట్టుబడే ఉన్నానని.. కర్ణుడి పాత్రను అలా చూపించడం తప్పు అని.. ఇలా ఎవరు చేసినా తాను ఊరుకోనని ఆయన స్పష్టం చేశాడు. ఓ ఇంటర్వ్యూలో అనంత శ్రీరామ్ మాట్లాడుతూ.. "రామాయణ, మహాభారతాలు కేవలం కథలు కావు. అవి మన చరిత్ర. ఆ ఇతిహాసాలను ఉన్నది ఉన్నట్లుగా మనకు అర్థమయ్యేలా రాశారు. వాటిని ఇష్టం వచ్చినట్లు మార్చే హక్కు ఎవరికీ లేదు. కమర్షియల్ హంగుల కోసం ఒక చెడ్డ పాత్రను గొప్పగా ఎలివేట్ చేసి చూపిస్తే అస్సలు సహించలేం. గతంలో ఇలాంటి తప్పులను ప్రశ్నించడానికి సరైన వేదికలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. అందుకే గొంతెత్తి మాట్లాడుతున్నాను. భవిష్యత్తులో మన పురాణాలను ఎవరు వక్రీకరించినా నా స్పందన ఇలాగే ఉంటుంది" అని స్పష్టం చేశాడు.




## వేగం పెంచాలోయ్ 'బైకర్' సాబ్



జనవరిలో సంక్రాంతి పండక్కు నారి నారి నడుమ మురారితో సూపర్ హిట్ కొట్టిన శర్వానంద్ మూడు నెలలు దాటడం ఆలస్యం ఏప్రిల్ 3 బైకర్ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామాలో యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఒక ముఖ్య పాత్రను పోషించారు. ఇప్పటిదాకా వచ్చిన కంటెంట్ శర్వా కష్టాన్ని బయట పెడుతున్నాయి తప్ప అసలు కంటెంట్ రివీల్ కావడం లేదు. ఈ క్రమంలో పబ్లిసిటీ వేగాన్ని పెంచాల్సిన బాధ్యత బైకర్ బృందం మీద ఉంది. దురంధర్ రివెంజ్, ఉస్తాద్ భగత్ సింగ్ వచ్చిన రెండు వారాల తర్వాత రిలీజ్ కాబట్టి శర్వా టీమ్ టెన్షన్ పడనక్కర్లేదు. చక్కగా ప్రమోషన్లు చేసుకుంటే జనానికి ఇందులో ఏముందో రీచ్ అవుతుంది. స్పోర్ట్స్, అందులో తెలుగు జనాలకు అంతగా సుపరిచితం కాని బైక్ రేసింగ్ కాబట్టి దానికి అనుగుణంగా ప్రేక్షకులను చేరుకోవాలంటే ఏం చేయాలో ముందు దాన్ని ప్లాన్ చేసుకోవాలి. కేవలం పోస్టర్లతో పనవ్వదు. మరిన్ని వీడియోలు బయటికి రావాలి. శర్వా జిమ్ లో కసరత్తులు చేయడం వగైరాలు ఓకే కానీ మరింత సాలిడ్ విజువల్స్ అసలు సినిమా నుంచి కట్ చేసి చూపించాలి. ముఖ్యంగా ట్రైలర్ ఇక్కడ చాలా కీలక పాత్ర పోషిస్తుంది. బిజినెస్ పరంగా యువి క్రియేషన్స్ కు మంచి ఆఫర్లే వస్తున్నాయి. కపుల్ ఫ్రెండ్లీ డీసెంట్ సక్సెస్, రాబోయే విశ్వంభర పాన్ ఇండియా రిలీజ్ దృష్టిలో పెట్టుకుని బయ్యర్ల నుంచి కావాల్సినంత సహకారమే ఉంది. సో బైకర్ కనక సరైన రీతిలో రిజిస్టర్ అయితే ఓపెనింగ్స్, వసూళ్లు రెండూ ఆశించవచ్చు. పోటీ కూడా పెద్దగా లేకపోవడం అడ్వాంటేజ్ అవుతుంది. డాల్బీ విజన్, 3డి లాంటి అత్యాధునిక ఫార్మాట్స్ లో రిలీజ్ చేస్తున్నప్పుడు దానికి తగ్గట్టే హంగామా చేయాలి. లో ప్రొఫైల్ ఇలాంటి మూవీస్ కి సూట్ అవ్వదు. మాళవిక నాయర్ హీరోయిన్ గా నటించిన బైకర్ కు జిబ్రాన్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.



# బిజినెస్ న్యూస్



## అడోబ్ సీఈఓ పదవి నుంచి వైదొలగనున్న శంతను నారాయణ్




అమెరికాకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్‌లో నాయకత్వ మార్పు జరగనుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కొనసాగుతోన్న శంతను నారాయణ్ ఆ పదవి నుంచి దిగిపోనున్నారు. ఈ మేరకు కంపెనీ (సూసీఎవ) తాజాగా ఓ ప్రకటన చేసింది. తదుపరి సీఈఓ ఎంపిక పూర్తయిన తర్వాత శంతను ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు పేర్కొంది. అయితే, బోర్డు ఛైర్మన్‌గా ఆయన కొనసాగుతారని తెలిపింది. అయితే, ఈ మార్పునకు గల కారణాన్ని మాత్రం కంపెనీ గానీ.. శంతను నారాయణ్ గానీ వెల్లడించలేదు. "సీఈవో బాధ్యతల నుంచి మారాలనుకుంటున్న నా నిర్ణయాన్ని బోర్డుకు తెలియజేశాను. దానికి బోర్డు అంగీకరించింది. ఇది గుడ్‌బై ఎంతమాత్రం కాదు. బోర్డు ఛైర్మన్‌గా కంపెనీ కోసం శ్రమిస్తూనే ఉంటా" అని ఉద్యోగులకు రాసిన మెయిల్‌లో శంతను పేర్కొన్నారు. మరోవైపు, అడోబ్ తదుపరి సీఈఓ ఎంపిక కోసం బోర్డు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. భారత్‌కు చెందిన 62 ఏళ్ల శంతను నారాయణ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఎంబీఏ చదివారు. తొలుత సిలికాన్ గ్రాఫిక్స్, యాపిల్‌లో కొంతకాలం పనిచేసిన ఆయన.. 1998లో అడోబ్‌లో జనరల్ మేనేజర్‌గా చేశారు. 2007లో కంపెనీ సీఈఓగా బాధ్యతలు అందుకున్నారు. ఆయన నాయకత్వంలో కంపెనీ రికార్డు రెవెన్యూను సాధించింది. క్రియేటివ్, డిజిటల్ మీడియా సాఫ్ట్‌వేర్‌లో ప్రత్యేక స్థానం సాధించింది. బిజినెస్ రంగంలో శంతను అందించిన సేవలకు గానూ.. భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

## బేర్‌మన్న సూచీలు.. ఇన్వెస్టర్ల జేబులకు మరో ?10 లక్షల కోట్లు చిల్లు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు, చమురు ధరలు పెరుగుదల, ఎఫ్‌ఐఐల విక్రయాలు వంటివి సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో సూచీలు వరుసగా మూడోరోజూ భారీ నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ ఓ దశలో 1500 పాయింట్లు నష్టపోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.10 లక్షల కోట్లు క్షీణించి రూ.429 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 75,444.22 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,034.42) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 74,454.60 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1470.50 పాయింట్ల నష్టంతో 74,563.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 488 పాయింట్ల నష్టంతో 23,151 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.45గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. ఎల్అండ్‌టీ, టాటా స్టీల్, ఎస్‌బీఐ, బీఈఎల్, మారుతీ సుజుకీ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100.61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5091 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవే..

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు కొనసాగుతున్నాయి. ఖమేనీ మరణంతో ఎంతోకాలం కొనసాగదనుకున్న ఈ పోరు.. ప్రాంతీయ యుద్ధంగా విస్తరించడమే కాకుండా రెండు వారాలు కూడా పూర్తి చేసుకుంటుండడం ప్రతికూల ప్రభావం చూపింది.

తగ్గినట్లే తగ్గిన చమురు ధర మళ్లీ 100 డాలర్ల మార్కును దాటింది. చమురు రవాణాలో కీలకమైన హార్మూజ్ జలసంధిని ప్రత్యర్థులపై 'ఒత్తిడి తెచ్చే సాధనం'గా మొజ్తాబా పేర్కొన్నారు. యుద్ధం ముగిసే వరకు దీని మూసివేత కొనసాగుతుందని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ పేర్కొనడంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి.

చమురు ధరలు పెరగడం మన రూపాయి విలువపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. దిగుమతుల బిల్లు పెరగడంతో రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో రూపాయి ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది.

మరోవైపు అమెరికాలో రెండేళ్ల కాలవ్యవధి కలిగిన బాండ్లపై రాబడులు ఆరు నెలల గరిష్ఠ స్థాయికి చేరాయి. 10 ఏళ్ల బాండ్ ఈల్డ్స్ కూడా భారీగా పెరిగాయి. అమెరికాలో బాండ్లపై రాబడులు పెరిగితే మనలాంటి వర్ధమాన దేశాల స్టాక్ మార్కెట్‌లకు నిధుల ప్రవాహం తగ్గుతుంది.

దేశీయంగా ఎఫ్‌ఐఐల అమ్మకాలు కొనసాగుతున్నాయి. వరుసగా 10 రోజైన గురువారం కూడా రూ.7050 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించడం ప్రతికూల ప్రభావం చూపింది. గడిచిన 10 ట్రేడింగ్ సెషన్లలో రూ.57వేల కోట్ల షేర్లను ఎఫ్‌ఐఐలు విక్రయించడం గమనార్హం.

## మరో డీల్ దిశగా భారత్-అమెరికా

### : యూఎస్ రాయబారి కీలక ప్రకటన



భారత్-అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతం దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్‌పై ఇరుదేశాల మధ్య అంగీకారం కుదరగా.. తాజాగా మరో ప్రకటన వెలువడింది. ఇరుదేశాల మధ్య త్వరలోనే క్రిటికల్ మినరల్స్ ఒప్పందం కుదరనున్నట్లు భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. ఇండియాటుడే కాంక్లేవ్ 2026లో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పారు. "భారత్-అమెరికా ద్వైపాక్షిక సహకారానికి ముఖ్యమైన రంగాల్లో క్రిటికల్ మినరల్స్ కీలకమైనది. ఈ ఖనిజాల విశ్వసనీయ సరఫరా గొలుసులు ఆర్థిక వృద్ధికి, జాతీయభద్రతకు ఎంతో అవసరం. అధునాతన తయారీ, ఇంధన వ్యవస్థలు, సాంకేతికత అభివృద్ధి తదితర రంగాల్లో ఈ ఖనిజాల వినియోగం కోసం ఇరుదేశాల మధ్య అతిత్వరలోనే ఒప్పందం కుదరనుంది" అని సెర్గియో గోర్ వెల్లడించారు. ఈసందర్భంగా భారత్, అమెరికాల మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం అంశాన్ని కూడా అగ్రరాజ్య రాయబారి ప్రస్తావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోదీ వ్యక్తిగత స్నేహం వల్ల ఈ ట్రేడ్ డీల్ సాధ్యమైందని తెలిపారు. ఏప్రిల్‌లో దీనిపై సంతకాలు జరగొచ్చని పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో భారత తయారీరంగాలకు 30 ట్రిలియన్ డాలర్ల మేర మార్కెట్ అవకాశాలు లభించనున్నట్లు తెలుస్తోంది.

## ఒరాకిల్‌లో ఉద్యోగాల కోత ?




బృంద సభ్యుల సామర్థ్యాలను పెంచడంలో కృత్రిమ మేధ (ఏఐ)కు క్రెడిట్ ఇవ్వడంతో పాటు, డేటా కేంద్రాల్లోకి ప్రవేశించేందుకు నిధులు సమకూర్చుకోవడానికి ఒరాకిల్ సిద్ధమైంది. ఇందులో భాగంగా రాబోయే నెలల్లో ఉద్యోగులను తగ్గించడానికి సన్నాహాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. లారీ ఎల్లిసన్ స్థాపించిన ఈ డేటాబేస్ గ్రూప్ పునర్నిర్మాణ వ్యయాల కోసం, అదనంగా 500 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,600 కోట్ల)ను కేటాయించినట్లు ఇటీవల త్రైమాసిక ఆదాయ నివేదిక తర్వాత యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు సమాచారమిచ్చింది. దీంతో ఆర్థిక సంవత్సరానికి దాని పునర్నిర్మాణ నిధులు 2.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.19,320 కోట్ల)కు చేరాయి. ఇది మునుపటి సంవత్సరాల కంటే చాలా ఎక్కువ. దీని ప్రకారం చూస్తే ఒరాకిల్ వేల మంది ఉద్యోగులను తగ్గించొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. భారీ ఏఐ డేటా కేంద్రాలను నిర్మించే ప్రణాళికలపై ఒరాకిల్, పెట్టుబడిదార్ల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటోంది. దీనికి రుణాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వచ్చే త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించకుండా ఒరాకిల్ పునర్నిర్మాణ ప్రణాళిక పరిధిని 500 మిలియన్ డాలర్లకు పెంచలేదని ఆర్‌బీసీ విశ్లేషకుడు రిషి జలూరియా అభిప్రాయపడ్డారు. తరచుగా ఉద్యోగుల తొలగింపులకు కోడ్‌గా ఉండే పునర్నిర్మాణం ఈ ఆర్థిక సంవత్సరం ముందు కంటే విస్తృతంగా ఉండొచ్చని ఒరాకిల్ సంకేతాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

గత ఏడాది ఆగస్టు-సెప్టెంబరు మధ్య ఒరాకిల్ అమెరికా, కెనడా, భారత్‌లలో 3,000 మందికి పైగా ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. సేల్స్, మార్కెటింగ్‌లో మధ్య స్థాయి ఉద్యోగులను తొలగించిందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి.

## శివయ్య సేవలో సాయి కిరణ్



**శ్రీకాళహస్తి,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి ఈశ్వరాలయానికి చలన చిత్ర నటుడు సాయి కిరణ్ కుటుంబ సభ్యులతో కలసిశుక్రవారం విచ్చేశారు.ముందు గా ఆలయం లో జరిగే రాహు కేతు సర్ప దోష నివారణ పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణా మూర్తి వద్ద వారికి వేద పండితుల ఆశీర్వచనం చేసి స్వామి అమ్మవార్ల చిత్రపటం తీర్థప్రసాదాలను అందజేశారు ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ శివపార్వతుల దీవెనల కోసం ఆలయానికి వచ్చినట్లు చెప్పారు

## ముక్కంటి సేవలో హీరో రోషన్



**శ్రీకాళహస్తి,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శివయ్య దర్శనం మనస్సు కు ఎంతో ప్రశాంతతను ఇస్తుందని సినీహీరో రోషన్ తెలిపారు.శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేద పండితులచే ఆశీర్వచనాలు అందుకున్నారు.రోషన్‌కు స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలు ఆలయ అధికారులు అందజేశారు.హీరో రోషన్ మీడియాతో మాట్లాడుతూ బ్యాండ్ మేళం సినిమా మార్చి 26 న శ్రీరామ నవమి సందర్బంగా విడుదల కానుదని. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని స్వామి అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యుయేషన్ కోడింగ్ సిస్టమ్‌పై అవగాహన కార్యక్రమం




**తిరుపతి,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు లో ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు-2026 కు సంబంధించి స్పాట్ వాల్యుయేషన్ కోడింగ్ సిస్టమ్ పై ఒక రోజుప్రాంతీయ స్థాయి ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది.ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్యామూల్, తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ సత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి కృష్ణప్ప పాల్గొన్నారు.ఈ సందర్భంగా రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్యామ్యూల్ మాట్లాడుతూ,ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియలో అమలు చేసే కోడింగ్ సిస్టమ్ అత్యంత కీలకమైనదని తెలిపారు. కోడింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కోడింగ్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్షల మూల్యాంకనం పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేలా అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు.తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ, స్పాట్ వాల్యుయేషన్‌లో కోడింగ్ సిస్టమ్ సరిగ్గా అమలు కావడం విద్యార్థుల ఫలితాల ఖచ్చితత్వానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కోడింగ్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి, నిర్దేశిత విధానాలను విధిగా పాటించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమానికి ఎనిమిది జిల్లాల నుండి వచ్చిన కోడింగ్ సిబ్బంది స్పాట్ వాల్యుయేషన్ విధానాలు, జాగ్రత్తలు మరియు మెళుకువలపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ (పబ్లిక్ ఎగ్జామ్స్) సుధ,సమగ్ర సి ఎం ఓ సురేష్, వేణుగోపాల్ కోడింగ్ సిస్టమ్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి వివరించి రిసోర్స్ పర్సన్ లుగా వ్యవహరించారు.

## రేపు కచ్చపి ఆడిటోరియంలో ఉగాది ఉత్సవాలు

**తిరుపతి,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక కచ్చపి ఆడిటోరియంలో 15వ తేది ఆదివారం పరాభవ నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వశ్రీ సాహితీ సమాఖ్య,,రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.శుక్రవారం ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు,డాక్టర్ లింగుట్ల రమేష్ నాథ్ లు మాట్లాడుతూ 19వ తేది ఉగాది నాడు అందరూ పండుగ నిర్వహణలో బిజీగా ఉంటారని ఆ కారణంగా అంతకు ముందుగానే 15వ తేది ఆదివారం ఉగాది ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. పరాభవ నామ ఉగాది సందర్భంగా ఇప్పటికే జాతీయ స్థాయిలో ఉగాది కథల పోటీలు నిర్వహించామని,175 మంది కథా రచయితలు పోటీలో పాల్గొన్నట్లు తెలిపారు.ఎంపికైన ఉత్తమ కథలకు ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులతో బాటు ఐదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని,కార్యక్రమంలో భాగంగా పాతిక కథలు,కథానికలతో శ్రీ వసంత గీతిక పేరుతో ముద్రించిన పుస్తకా విష్కరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.అదే రోజు మధ్యాహ్నం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ లింగుట్ల రమేష్ నాథ్ 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉదయం 10 గంటల నుంచి సాహితీ సభ జరుగుతుందని ఈ కార్యక్రమానికి సురవరం ప్రతాప్ రెడ్డి తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వలిదండ నిత్యానంద రావ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.కథా సంచికరూపకల్పనలో, బహుమతుల ఎంపికలో పాల్గొన్న న్యాయ నిర్ణేతలు ఆచార్య మధురాంతకం నరేంద్ర,ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.సంస్కృత విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ గంగిశెట్టి లక్ష్మినారాయణ /ఉగాది ప్రాశస్త్యం గురించి వివరిస్తారన్నారు.మీడియా సమావేశంలో మన్నవ గంగాధర్,ఆలిండియా రేడియో మాజీ డైరెక్టర్ మల్లీశ్వర రావ్ తదితరులు పాల్గొన్నారు.




## ముక్కంటి సేవలో ఆస్ట్రేలియా దేశస్తులు



**శ్రీకాళహస్తి,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పరదేశీయులు సందడి చేశారు. సంప్రదాయ దుస్తులతో ఆస్ట్రేలియా దేశానికి చెందిన 25 మంది బృందంగా విచ్చేశారు. ముందుగా ఆలయంలో జరిగే రాహు కేతు సర్ప దోష నివారణ పూజలు నిర్వహిం చుకున్నారు.అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.అదేవిధంగా ఆలయం లోపల వినాయక స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, శని భగవానుని,ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా వారు ఇక్కడి ఆలయ శిల్పకళ సౌందర్యాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు పురాతన కాలంలో నిర్మించిన గోపురాలు ఆలయంలో స్తంభాలపై చెక్కిన శిల్పకళల లను చూసి ఆత్మానందాన్ని పొందారు వారి స్నేహితులు చెప్పడంతో ఇక్కడి ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చినట్లు వివరించారు.

# తిరుపతి నగర రూపురేఖల మార్పునకు శ్రీకారం చుట్టాం

**-తిరుపతి నగరానికి తొలి మేయర్ కావడం నాకు లభించిన అరుదైన గౌరవం -ముగిసిన మునిసిపల్ కౌన్సిల్ పదవీ కాలం**

**-సమావేశం ప్రారంభ ఉపన్యాసంలో మేయర్ డాక్టర్ శిరీష భావోద్వేగం**





**తిరుపతి,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి నగర రూపురేఖలను మార్చేందుకు బలమైన పునాదులతో శ్రీకారం చుట్టామని తమ ఐదు సంవత్సరాల పాలనలో తీసుకున్న నిర్ణయాలే తిరుపతి గ్రేటర్ నగరంగా మారడానికి అడుగులు పడుతున్నాయని.. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు.నగరపాలక సంస్థ కౌన్సిల్ ఐదేళ్ల పదవీ కాలం ముగింపు సందర్భంగా శుక్రవారం ఎస్వీయూ సెనెట్ హాల్ లో ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మేయర్ తన చివరి ప్రసంగం లో భావోద్వేగానికి గురయ్యారు.ఆధ్యాత్మిక కేంద్రం శ్రీవారి పాదాల చెంత నెలకొన్న తిరుపతి నగరానికి ప్రజాప్రతినిధులుగా పనిచేయడం మనందరి అదృష్టం అని, దాదాపు ఐదు లక్షల మంది తిరుపతి నగర ప్రజలలో మనకు మాత్రమే లభించిన అరుదైన గౌరవంగా పేర్కొన్నారు..ఐదు సంవత్సరాల పాలనలో అనేక తీపి గుర్తులు, మరిచిపోలేని అనుభూతులు మన కళ్ళ ముందు మెదలాడుతున్నా యన్నారు.ఎన్ని పరిమితులు ఉన్నా మనల్ని ఎన్నుకున్న ప్రజల ముందు 'మేము మీ కార్పొరేటర్లు' అని చెప్పగలిగే స్థాయిలో మన పనితీరు ఉందన్న నమ్మకం తనకు ఉందన్నారు చిన్నా పెద్దా అన్న బేధ భావం లేకుండా అందరం కలిసి పనిచేశామని.మనం తీర్మానం చేసినట్లు గ్రేటర్ తిరుపతి గా మారితే మనకు చరిత్రలో ఎవరికి దక్కని మరో గౌరవం కూడా దక్కుతుందన్నారు. తిరుపతి నగర పాలక సంస్థకు మొదటి చివరి కార్పొరేటర్లుగా మీరు, మరియు మొదటి చివరి మహిళా మేయర్ గా నిలిచిపోతామని,మున్సిపాలిటీకి ఎందరో చైర్మన్లు గా పనిచేశారు కానీ నగర పాలక సంస్థ ఏర్పడిన తర్వాత మనదే మొదటి కౌన్సిల్ అని అన్నారు. గ్రేటర్ గా మారితే గ్రేటర్ నగరం అవుతుందని తద్వారా మన కౌన్సిల్ మొదటిది, చివరిది అవుతుందన్నారు. ఇప్పటి వరకు పనిచేసిన కౌన్సిల్ లు అంతర్గత అభివృద్ధి, ప్రజల రోజువారి అవసరాలపై దృష్టి పెడితే మనం తిరుపతి రూపురేఖలు మార్చే ప్రయత్నం చేశామని.నగరంలో చిన్న రోడ్డు విస్తరణ చేయాలనే ఆలోచన కూడా సాధ్యం కాని రోజులు నుంచి కీలకమైన కూడళ్లలో విస్తరణ పూర్తి చేయడం ద్వారా నగర పౌరుల ప్రయాణాన్ని సులభతరం చేసామ న్నారు. కోర్లగుంట సర్కిల్, గంగమ్మ గుడి సర్కిల్,బాలాజీ కాలనీ కూడలి, ఎం.ఆర్.పల్లి కూడలి వద్ద నిలుచుని ఇది మేము చేశామని గర్వంగా చెప్పుకునే విధంగా మనం అభివృద్ధి చేశామన్నారు. తిరుపతి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రోడ్డుల నిర్మాణం ఒక సాహసం అని, నేడు తిరుపతి భవిష్యత్తుకు సూచికలుగా నిలబడుతున్నాయన్నారు.ఇందులో నాటి శాసన సభ్యులు కరుణాకర్ రెడ్డి సహకారం, ఉపమేయర్‌గా పనిచేసిన అభినయ్ రెడ్డి ప్రతిపాదనలు కీలకం అని చెప్పడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. వ్యక్తిగతంగా అనేక సంవత్సరాల పాటు ఒక సాధారణ భక్తురాలిగా తిరుపతిలో గంగమ్మ ఆలయానికి వెళ్లి దర్శనానికి, మొక్కులు తీర్చుకోవడానికి ఎంత ఇబ్బంది పడ్డానో ఒక భక్తురాలుగా తనకు తెలుసునని, నేడు అభివృద్ధి చెందిన ఆలయ ప్రాంగణం ప్రాంత డివిజన్ కార్పొరేటర్ గా నగర మేయర్ గా తనకు సంతృప్తి నిచ్చిందన్నారు.`ంగమ్మ ఆలయ అభివృద్ధితో మన హయాంలో కొత్త రూపు వచ్చిందన్నారు. కబడ్డీ పోటీలు, కచ్చపి ఆడిటోరియం ఇలా మనం అభివృద్ధి పనులు చేయడం మనందరం సంతోషించే అంశం అని,క్లిష్ట సమయంలో కార్పొరేటర్లు ఆదర్శంగా నిలిచారన్నారు.. కరోనా సమ యంలో కుటుంబ సభ్యులు కూడా దహన క్రియలకు దూరంగా ఉండే భయానక పరిస్తితులలో మన కార్పొరేటర్లు చేసిన సాహసం దేశానికే ఆదర్శంగా నిలిచిందని. సేవా కార్యక్రమాల నిర్వహణలో కార్పొరేటర్లు గొప్ప పాత్ర పోషించారన్నారు. వరదలు వచ్చిన సమయంలో ప్రజలకు అండగా నిలబడిన తీరు ప్రశంసనీయం. అని పేర్కొన్నారు.నేను డాక్టర్ గా ప్రజా జీవితంలో చాలా కాలం నుంచి ఉన్నాను.. కానీ రాజకీయం గా ప్రజా జీవితంలో పొందిన సంతృప్తి చాలా గొప్పదని.అందుకే అన్ని రంగాల్లో కన్నా రాజకీయ రంగంలోనే సమాజానికి గొప్పగా సేవ చేయవచ్చునని ఈ స్వల్ప రాజకీయ అనుభవం తనకు నేర్పిందని,మేయర్ కావడం తనాకు లభించిన అరుదైన గౌరవం అంటూ తనను మేయర్ గా ఈ స్థానంలో కూర్చోబెట్టిన తిరుపతి నగర ప్రజలకు , కార్పొరేటర్ల కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తాను రాజకీ య కుటుంబానికి చెందిన వ్యక్తిని కాదని ఒక సాధారణ డాక్టర్ ని. గురువారెడ్డి లాంటి గొప్పవారు చైర్మన్ గా పనిచేసిన స్థానం, మహామ హులు ప్రాతినిధ్యం వహించిన నియోజక వర్గం. అన్నింటి కన్నా కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం శ్రీవారి పాదాల చెంత నెలకొన్న నగరం ఈ నగరానికి ప్రథమ పౌరురాలు కావడం అసాధారణ విషయం అలాంటి అసాధారణ గౌరవాన్ని నాకు ఇచ్చిన తిరుపతి మాజీ శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డికి,పార్టీ నియోజక వర్గ సమన్వయ కర్త అభినయ్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో ఎందరో సీనియర్లు ఉన్నా తప పట్ల నమ్మకం ఉంచి నన్ను మేయర్ గా చేసిన భూమన కుటుంబానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నగరానికి పునాది వేసిన వారు యాదవ వంశానికి చెందిన గట్టురాజులు లాంటి సామా జిక తరగతికి చెందిన వారికి రాజకీయ నాయకత్వంలో సముచిత స్థానాన్ని ఇవ్వాలన్న తలంపుతో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో తనకు మేయర్ పదవి రావడానికి దోహదపడిందని తన పట్ల అత్యంత నమ్మకంతో తిరుపతి మేయర్ గా ఎంపిక చేశారన్నారు. సాధారణ కుటుంబంకు చెందిన తనకు అసాధా రణ గౌరవం , హోదా ఇచ్చిన వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి కి సదా కృతజ్ఞతగా ఉంటానన్నారు.ఒక మహిళ అందులోను ఎలాంటి రాజకీ య అనుభవం లేని నన్ను నిత్యం ప్రోత్సహించి వెన్నుదన్నుగా నిలిచిన తన భర్త డా మునిశేఖర్,నాన్న, అమ్మ తన ఇద్దరు పిల్లలు ఇచ్చిన సహకారం తో తేను సాఫీగా నా విధులను నిర్వహించగలిగాన న్నారు.తన పదవీ కాలంలో పనిచేసిన స్థూలంగా కమిషనర్ లు అందరూ తనను అత్యంత అభిమానంతో చూసారని. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు వందల మంది సిబ్బంది.. ప్రత్యేకించి తన వ్యక్తిగా సిబ్బంది తనను కంటికి రెప్పలా చూసుకున్నారని. అందరూ నన్ను మేయర్ గా కన్నా తమ ఇంటి మనిషి అన్నట్లు ప్రేమగా చూసుకో వడం తనకు లభించిన గొప్ప వెసులుబాటుగా భావిస్తున్నానన్నారు. బాధ్యతల నుంచి తప్పుకునే ఈ సమయం కాస్త ఇబ్బందిగానే ఉందని అయితే ఆది. పదవి మీద మోజుతో కాదు ఏదో తెలియని వెలితి అని డాక్టర్ శిరీష పేర్కొన్నారు. సంతోషం, అభిమానం, సమాజంలో గుర్తింపు, భావోద్వేగం అన్నీ ఉన్న ఈ సమయంలో తాను చివరి మాట గా తాను మేయర్‌గా సాధించింది ఏమిటంటే నేను మీ నమ్మకాన్ని వమ్ము చేయలేదు అని గర్వంగా చెప్పగలను. నగర పాలక సంస్థ మేయర్ స్థానాన్ని వివాదాలకు దూరంగా ఉంచాను. నన్ను ఈ స్థానానికి ఎంపిక చేసినప్పుడు, తర్వాత 2024 ఎన్నికల తర్వాత రాష్ట అధికార మార్పు జరిగినపుడు ఎన్నో ప్రచారాలు జరిగాయని,దేవుడి దయతో అన్నింటికి కాలమే సమాధానం చెపుతుందని నిబ్బరంగా నిలబడిన తాను ధైర్యంగా , గర్వంగా ఆత్మవిశ్వాసంతో మీ ముందు నిలబడ్డాన న్నారు. కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, నగర కమిషనర్ మౌర్య, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

**-బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్**




**తిరుపతి,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బ్యాంకర్లు విద్యా రుణాలను సకాలంలో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేసించారు.వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎం సి పి ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు లో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశానికి చైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఆర్బిఐ ఎల్డీఓ నవీన్, నాబార్డ్ డిడిఎం సునీల్,ఎల్డీఎం గుంటూరు రవి కుమార్, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ సామంచి శర్మ , వివిధ బ్యాంకు అధికారులుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎం సి పి ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. విద్యా హబ్ అయిన తిరుపతి జిల్లాలో పలు విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, విద్యకు సంబంధించిన రుణాల విషయంలో ప్రత్యేక ప్రాధాన్యతవిస్తూ రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. పి ఎం ఈ జి పి పథకం రుణాలు మంజూరైన యూనిట్లు అన్ని గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రైవేటు బ్యాంకులు రుణాల మంజూరు విషయంలో వెనకబడి ఉన్నాయని ఎలాంటి జాప్యం చేయకుండా రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకర్లందరూ రుణాల మంజూరు లో నిర్దేశించబడిన లక్ష్యాలను అందిపుచ్చు కోవాలని సూచించారు. జిల్లాలో వర్షాలు అధికంగా పడే అవకాశం ఉన్నందు వలన క్రాప్ లోన్ సంబంధించిన రుణాల విషయంలో బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కౌలు రైతు కార్డుదారులకు క్రాప్ లోన్ కి సంబంధించిన రుణాలను బ్యాంకర్లు సకాలంలో మంజూరు చేయాలనీ తెలిపారు..జిల్లాలో ఫైనాన్సియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లావాదేవీల పై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, , బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## ఎన్నో జన్మల పుణ్యఫలంతోనే వైదిక విద్యను అభ్యసించే అవకాశం

**- శ్రీ శృంగేరీ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామీజీ**





**తిరుమల,మార్చి 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎన్నో జన్మల్లో పుణ్యం చేసుకుంటేగానీ వైదిక విద్యను అభ్యసించే అవకాశం కలగదని శ్రీ శృంగేరీ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామీజీ తెలియజేశారు. తిరుమలలోని ధర్మగిరి వద్ద ఉన్న శ్రీవేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠంలో ఆరు రోజుల పాటు నిర్వహించిన 29వ శ్రీవేంకటేశ్వర వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సులో చివరిరోజైన శుక్రవారం సమాపనోత్సవానికి (విజయోత్సవానికి) విశిష్ట అతిథిగా ఆయన విచ్చేశారు. ఆయన వేద విద్యార్థులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ ధర్మమే సమస్త ప్రపంచానికి ఆధారమని, వైదికమార్గం ద్వారానే ప్రపంచ శ్రేయస్సు లభిస్తుందని చెప్పారు. పరమ పవిత్రమైన తిరుమలక్షేత్రంలో ఉన్న వేద విజ్ఞాన పీఠం ప్రాచీన కాలం నుండి వేద, శాస్త్ర, ఆగమ విద్యలకు సంజీవనిగా నిలుస్తోందన్నారు. వైదిక విద్య చాలా ఉత్కృష్టమైన విద్య అని, అన్ని ప్రమాణాల్లో వేదాలే సర్వ శ్రేష్ఠమైనవి అని తెలిపారు. వైదిక విద్యకు ఆచారం, సాంప్రదాయమే ముఖ్యమని చెప్పారు. వైదిక విద్యను అభ్యసించిన వారిని సమాజం మొత్తం గౌరవించాలని తెలియజేశారు. అనంతరం ఆయన పరీక్షల్లో ఉత్తీర్ణులైన 313 మంది విద్యార్థులను సన్మానించి విజయ పత్రికలను ప్రదానం చేశారు. కాగా వేద, శాస్త్ర, ఆగమాల్లోని 37 విభాగాల్లో దేశవ్యాప్తంగా 412 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 313 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 202 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవ్వగా, 111 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఈ కార్యక్రమం లో శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని, పండితులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027